ఆంధ్రజ్యోతి
andhrajyothy.com శుక్రవారం ఉష్ణోగ్రత గరిష్ఠం 34.5, కనిష్ఠం 18.0
నిజామాబాద్ జిల్లా వార్తలు
5
శనివారం 25 జనవరి 2025



సీఎం రేవంత్‌రెడ్డితో ఎమ్మెల్యేలు సుదర్శన్‌రెడ్డి, భూపతిరెడ్డి

సీఎంకు అభినందనలు తెలిపిన జిల్లా ఎమ్మెల్యేలు

నిజామాబాద్ అర్బన్, జనవరి 24 (ఆంధ్రజ్యోతి): దావోస్ పర్యటనను విజయవంతంగా ముగించుకొని రాష్ట్రానికి లక్షా 78కోట్ల పెట్టుబడులతో పాటు 49వేల 550 ఉద్యోగాలతో తిరిగి వచ్చిన సీఎం రేవంత్‌రెడ్డిని జిల్లాకు చెందిన ఎమ్మెల్యేలు సుదర్శన్‌రెడ్డి, భూపతిరెడ్డిలు అభినందించారు. హైదరాబాద్‌లోని సీఎం నివాసంలో శుక్రవారం జిల్లాకు చెందిన మాజీ మంత్రి, బోధన్ ఎమ్మెల్యే సుదర్శన్‌రెడ్డి, రూరల్ ఎమ్మెల్యే భూపతిరెడ్డిలు సీఎంను కలిసి అభినందనలు తెలిపారు. వీరితో పాటు ప్రభుత్వ సలహాదారులు కేశవరావు, వేంనరేందర్‌రెడ్డి, హైదరాబాద్ మేయర్ విజయలక్ష్మి, ప్రేమ్‌సాగర్‌రావు తదితరులు ఉన్నారు.

నేడు జిల్లాకు బీఆర్‌ఎస్ రైతు అధ్యయన కమిటీ

నిజామాబాద్, జనవరి 24 (ఆంధ్రజ్యోతి ప్రతినిధి): బీఆర్‌ఎస్ రైతు అధ్యయన కమిటీ శనివారం జిల్లాకు రానుంది. మాజీ మంత్రి నిరంజన్‌రెడ్డి చైర్మన్‌గా ఉన్న ఈ అధ్యయన కమిటీ జిల్లాలోని రైతుల సమస్యలను తెలుసుకోనున్నారు. రైతు ఆత్మహత్యలు, రైతులు ఎదుర్కొంటున్న వాస్తవ పరిస్థితులను వారు అధ్యయనం చేయనున్నారు. జిల్లాలోని బాల్కొండ నియోజకవర్గం మెండోరా మండలంలోని బుస్సాపూర్‌లో కమిటీ సభ్యులు పర్యటించనున్నారు. మాజీ మంత్రి, ఎమ్మెల్యే వేముల ప్రశాంత్‌రెడ్డి ఆధ్వర్యంలో కమిటీకి రైతులు సమస్యలను వివరించనున్నారు. రైతులతో మాట్లాడి వివరాలను కమిటీ సభ్యులు తెలుసుకోనున్నారు. అక్కడి నుంచి నిజామాబాద్ రూరల్ నియోజకవర్గం పరిధిలోని జక్రాన్‌పల్లి మండలం అర్గుల్‌కు చేరుకుంటారు. అర్గుల్‌లో మాజీ ఎమ్మెల్యే బాజిరెడ్డి గోవర్ధన్ ఆధ్వర్యంలో రైతుల సమస్యలను వారు తెలుసుకున్నారు. రైతులతో సమావేశమై వారితో నేరుగా మాట్లాడనున్నారు. మాజీ మంత్రి నిరంజన్‌రెడ్డి ఆధ్వర్యంలో వచ్చే ఈ కమిటీలో మాజీ మంత్రులు అజయ్‌కుమార్, జోగు రామన్న, జిల్లాకు చెందిన బాజిరెడ్డి గోవర్ధన్, అంజయ్యతో పాటు ఇతర సభ్యులు పాల్గొంటారు.

నేడు మంద కృష్ణ మాదిగ రాక

డిచ్‌పల్లి, జనవరి 24(ఆంధ్రజ్యోతి): జిల్లా కేంద్రానికి శనివారం ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపక అధ్యక్షుడు మంద కృష్ణ మాదిగ రానున్నారని జిల్లా ఎమ్మార్పీఎస్ సీనియర్ నాయకుడు నాగభూషణం తెలిపారు. ఫిబ్రవరి 7న హైదరాబాద్‌లో నిర్వహించనున్న సదస్సుకు ఇంటికి ఒకరు తరలివచ్చి విజయవంతం చేయాలని ఆయన పిలుపునిచ్చారు. ఎస్సీ వర్గీకరణకు మద్దతు తెలపాలని ఆయన కోరారు.

ముగిసిన సభలు

- జిల్లాలోని 530 గ్రామ పంచాయతీలు, 146 మున్సిపల్ వార్డుల్లో సమావేశాల నిర్వహణ
- రేషన్ కార్డులు, ఇందిరమ్మ ఇళ్లు, ఆత్మీయ భరోసా కోసం భారీగా దరఖాస్తుల స్వీకరణ
- అర్హులకు జాబితాలో చోటు దక్కలేదని అధికారులను ప్రశ్నించిన గ్రామస్థులు
- నిరసనల మధ్య ముగిసిన ప్రజాపాలన గ్రామ, వార్డు సభలు



నగర పాలక సంస్థ కార్యాలయంలో దరఖాస్తులు స్వీకరిస్తున్న అధికారులు



నర్సింగ్‌పల్లి గ్రామ సభలో అభ్యంతరాలు వ్యక్తం చేస్తున్న ప్రజలు

నిజామాబాద్, జనవరి 24 (ఆంధ్రజ్యోతి ప్రతినిధి): జిల్లాలో నాలుగు రోజుల పాటు జరిగిన ప్రజాపాలన సమావేశాలు శుక్రవారంతో ముగిశాయి. ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా చేపట్టిన రైతుభరోసా, ఇందిరమ్మ ఇళ్లు, ఆహార భద్రత కార్డులు, ఆత్మీయ భరోసా పథకాల లబ్ధిదారుల ఎంపికపై గ్రామ సభల్లో చర్చించారు. జాబితాలో ఉన్న పేర్లను ప్రకటించారు. జిల్లాలో జరిగిన గ్రామ, వార్డు సభల్లో జాబితాలో పేర్లులేని వారు పెద్దఎత్తున సభలకు హాజరయ్యారు. రేషన్ కార్డులు, ఇందిరమ్మ ఇళ్లు, ఆత్మీయ భరోసా కోసం ఎక్కువగా దరఖాస్తు చేసుకున్నారు. జిల్లాలో ఈ నాలుగు పథకాల అమలుకు ఎంపికైన లబ్ధిదారుల కంటే ఎక్కువ మొత్తంలో దరఖా స్తులు రావడంతో అధికారులు కూడా అన్నింటిని భద్రపరుస్తున్నారు. ప్రభుత్వం విడుదల చేసే మార్గ దర్శకాలకు అనుగుణంగా నిర్ణయం తీసుకునేందుకు సిద్ధమవుతున్నారు.

నాలుగు రోజుల పాటు కొనసాగిన సభలు

జిల్లాలో ఈనెల 21 నుంచి 24 వరకు నాలుగు రోజుల పాటు గ్రామసభలను నిర్వహించారు. జిల్లాలోని 530 గ్రామ పంచాయతీలు, 146 మున్సిపల్ వార్డుల్లో ఈ సమావేశాలను నిర్వహించారు. మొత్తంగా 676 సభలను నిర్వహించడంతో పాటు నాలుగు రోజుల పాటు నిర్వహించిన ఈ సభల్లో ప్రజల నుంచి వచ్చిన విజ్ఞప్తులను స్వీకరించారు. జిల్లాలో ఈ గ్రామసభల్లో ఎక్కువగా రేషన్ కార్డులు, ఇందిరమ్మ ఇళ్లపైనే విమర్శలు ఎక్కువగా వచ్చాయి. పలు దఫాలు రేషన్ కార్డుల కోసం దరఖాస్తులు చేసిన జాబితాలో పేరు రాలేదని ఆరోపించారు. అధికారులకు ఫిర్యాదులను చేశారు. కనీసం ఇంటిలో కొత్త సభ్యులను కూడా చేర్చేందుకు అవకాశం ఇవ్వలేదని అధికారులకు విన్నవించారు. ఇందిరమ్మ ఇళ్ల ఎంపికలో నిరుపేదలకు ఎక్కువగా ప్రాధాన్యం ఇవ్వలేదని ఈ గ్రామసభల్లో పేర్కొన్నారు. ఆత్మీయ భరోసాకు కొన్ని గ్రామాల పరిధిలో ఎక్కువగా విమర్శలు వచ్చినా.. తమ పేర్లను కూడా పరిశీలించాలని ఉపాధి హామీ కూలీలు దరఖాస్తు చేశారు. రైతుభరోసాకు మాత్రం తక్కువగా దరఖాస్తులు వచ్చాయి. ప్రస్తుతం అన్ని మండలాల పరిధిలో వచ్చిన దరఖాస్తులను మండల కేంద్రాల్లోనే ఉంచి పరిశీలించేందుకు సిద్ధమవుతున్నారు.

జిల్లా వ్యాప్తంగా ప్రజాపాలన సభలో అధికారులు స్వీకరించిన దరఖాస్తులు..	
రేషన్ కార్డులు	81,148
ఇందిరమ్మ ఇళ్లు	40,266
రైతు భరోసా	1,626
ఆత్మీయ భరోసా	19,305

మూడు రోజుల్లోనే భారీగా దరఖాస్తులు

జిల్లాలో మూడు రోజుల్లోనే భారీగా దరఖాస్తులు వచ్చాయి. ఈనెల 23 వరకు జిల్లాలో 97వేల 466 మంది ఈ నాలుగు పథకాలకు దరఖాస్తులను చేసుకున్నారు. జిల్లాలో రేషన్ కార్డుల కోసం ఈ మూడు రోజుల్లో అత్యధిక మంది దరఖాస్తులు చేశారు. జిల్లాలో 55వేల 800 మంది కొత్తగా రేషన్ కార్డుల కోసం దరఖాస్తులను అందించారు. ఇందిరమ్మ ఇళ్ల కోసం 26వేల 648 మంది, ఆత్మీయ భరోసా కోసం 13వేల 645 మంది, రైతుభరోసా కోసం 1293 మంది దరఖాస్తులను చేసుకున్నారు. మూడు రోజుల్లోనే దరఖాస్తులు భారీగా రాగా నాల్గవ రోజు కూడా మరో 50వేల వరకు దరఖాస్తులు వస్తాయని అధికారులు అంచనా వేశారు. నాలుగు రోజుల పాటు ఎలాంటి ఇబ్బంది ఏర్పడకుండా ఈ సభలను నిర్వహించామని కలెక్టర్ రాజీవ్ గాంధీ హన్మంతు తెలిపారు. దరఖాస్తులన్నీ పరిశీలించి నిర్ణయం తీసుకుంటామని ఆయన తెలిపారు.

అర్హుల జాబితాపై అభ్యంతరాలు..

మోపాల్:ఇళ్లు ఉన్న వారికే ఇళ్లను మంజూరు చేస్తున్నారని గుడిసెలో ఉన్నవారి పరిస్థితి ఏంటని గ్రామస్థులు అధికారులను ప్రశ్నించారు. శుక్రవారం మండలంలోని నర్సింగ్‌పల్లి, ముదక్‌పల్లిలో గ్రామసభలను నిర్వహించారు. ఈ సందర్భంగా నర్సింగ్‌పల్లిలో అధికారులు ఇందిరమ్మ ఇళ్ల లిస్ట్‌ను చదివి వినిపించగా అనేక మంది ప్రజలు పలు అభ్యంతరాలను వ్యక్తంచేశారు. ఇందిరమ్మ ఇళ్ల సర్వేలో అన్నీ అక్రమాలు జరిగాయని అధికారుల దృష్టికి తీసుకువచ్చారు. గ్రామంలో ఎన్నోఏళ్లుగా స్వామిదాస్, సాయమ్మలు గుడిసెలో నివాసం ఉంటున్నారని వీరు ఇళ్ల కోసం దరఖాస్తు కూడా ప్రజాపాలనలో చేసుకున్నారని గ్రామస్థులు అధికారులకు వివరించారు.

నగరంలో..

సుభాష్‌నగర్: జిల్లా కేంద్రంలోని 2, 28 డివిజన్‌లలో నగర పాలక సంస్థ కమిషనర్ దిలీప్‌కుమార్ పర్యటించారు. నగర పాలక సంస్థ పరిధిలో 1, 2, 3, 4, 5, 9, 15, 21, 28, 30, 31, 40, 58, 59, 60 డివిజన్‌లలో వార్డు సభలు జరిగాయి. ఉదయం 8 నుంచి 12గంటల వరకు 8 వార్డులలో, 12గంటల నుంచి 5గంటల వరకు 7 వార్డులలో వార్డు సభలు జరిగాయి. మున్సిపల్ కార్యాలయంలో రెండు దరఖాస్తు కేంద్రాలను అధికారులు ఏర్పాటు చేశారు. దీంతో దరఖాస్తుదారులతో కార్యాలయం కిటకిటలాడింది. డివిజన్ పర్యటన అనంతరం కమిషనర్ దిలీప్ కుమార్ ప్రజలతో మాట్లాడారు. రేషన్ కార్డు, ఇందిరమ్మ తదితర పథకాల్లో పేర్లు లేకుంటే దరఖాస్తు చేసుకోవాలని అన్నారు.

నిరసనలు, నిలదీతల మధ్య ముగిసిన గ్రామసభలు..

ధర్పల్లి: మండలంలో ఈనెల 21 నుంచి చేపట్టిన గ్రామసభలు నిరసనలు, నిలదీతల మధ్య ముగిశాయి. శుక్రవారం మండలంలోని సీతాయి పేట్, గుడితండా, బేల్యాతండా, మోదిన్‌సాబ్ తండాల్లో గ్రామసభలు జరిగాయి. ఆయా గ్రామసభల్లో లబ్ధిదారుల జాబితాను అధికారులు చదివి వినిపించారు. అర్హులైన తమకు జాబితాలో చోటుదక్కలేదని అన్ని గ్రామాల్లో గ్రామస్థులు అధికారులను నిలదీశారు. మొత్తంమీద గ్రామసభలు నిరసనల మధ్య ముగిశాయి. ఈ కార్యక్రమంలో ఎండీవో బాలకృష్ణ, సీతాయిపేట్ కార్యదర్శి కృష్ణకాంత్, ఏపీవో వినోద, గ్రామస్థులు పాల్గొన్నారు.

స్కిల్ డెవలప్‌మెంట్‌లో శిక్షణకు కసరత్తు

- జిల్లాలో ఐటీఐ, పాలిటెక్నిక్ చదివే విద్యార్థులకు స్కిల్ డెవలప్‌మెంట్‌లో శిక్షణ ఇచ్చేందుకు పైలెట్ ప్రాజెక్టు
- ఫిబ్రవరి లేదా మార్చిలో ప్రారంభించేందుకు ఏర్పాట్లు
- రాష్ట్ర స్థాయిలో వివిధ కంపెనీలతో శిక్షణ ఇచ్చేందుకు ఒప్పందాలు
- విద్యార్థులకు ఉపాధి కల్పించేందుకే ఈ శిక్షణ : బోధన్ ఎమ్మెల్యే సుదర్శన్‌రెడ్డి

8



ఉపాధి హామీకి కసరత్తు!

- వచ్చే ఆర్థిక సంవత్సరంలో జిల్లాలో ఉపాధి హామీ ద్వారా రూ.330.84 కోట్లతో పనులు చేపట్టేందుకు నిర్ణయం
- కూలీలందరికీ వంద రోజుల పాటు పనులు కల్పించే విధంగా ప్రణాళిక
- పశువులు, కోళ్ల పెంపకం, ఉద్యానవన పంటలకు ప్రాధాన్యం

నిజామాబాద్, జనవరి 24 (ఆంధ్రజ్యోతి ప్రతినిధి): జిల్లాలో ఉపాధి హామీ పథకం పనులను చేపట్టేందుకు యంత్రాంగం సిద్ధమవుతోంది. వచ్చే సంవత్సరం పాటు పనులు చేపట్టేందుకు గ్రామాల వారీగా బడ్జెట్‌ను చేపట్టారు. జిల్లాలోని ఉపాధి హామీ కార్డులు ఉన్న ప్రతి ఒక్కరికీ పని కల్పించేందుకు ఏర్పాట్లు చేస్తున్నారు. అన్ని మండలాల పరిధిలో రైతులు, ప్రజలకు అవసరమైన పనులను చేసేందుకు నిర్ణయించారు. ఈ ఆర్థిక సంవత్సరం ముగింపులోపు పనులను చేపట్టడంతో పాటు కొత్త ఆర్థిక సంవత్సరం నుంచి ఎక్కువ మొత్తంలో పనులు చేసి వ్యవసాయ పనులులేని సమయంలో కూలీలకు పెద్ద ఎత్తున ఉపాధి కల్పించేందుకు సిద్ధమవుతున్నారు.

జిల్లాలో 2,55,236 జాబ్‌కార్డులు

జిల్లాలో మొత్తం 2లక్షల 55వేల 236 జాబ్ కార్డులు ఉన్నాయి. ఈ కార్డుల పరిధిలో 4లక్షల 83వేల 762 మంది కూలీలు ఉన్నారు. వీరంతా కొన్నేళ్లుగా ఈ పథకం కింద ఉపాధి హామీ పనులను చేస్తున్నారు. ప్రతి ఒక్కరికీ వంద రోజులు పని కల్పించడంతో పాటు కేంద్ర ప్రభుత్వం నిర్ణయించిన విధంగా ప్రతి రోజు వారు చేసిన పనికి వేతనాలను చెల్లిస్తున్నారు. ప్రతీ రోజు సగటున కూలీకి రూ.300 నిర్ణయించారు. వారు చేసిన పని ఆధారంగా వేతనం నిర్ణయించి వారి ఖాతాల్లో జమ చేస్తున్నారు. జిల్లాలో 2025-26 ఆర్థిక సంవత్సరంలో ఉపాధి హామీ పనులను చేపట్టేందుకు బడ్జెట్ ను తయారు చేశారు. బడ్జెట్‌ను రూ.330.84 కోట్లుగా నిర్ణయించారు. ఏప్రిల్ నుంచి వచ్చే సంవత్సరం మార్చి వరకు 12 నెలల పాటు ఈ బడ్జెట్‌కు అనుగుణంగా 530 గ్రామ పంచా యతీల్లో పనులు చేపట్టేందుకు నిర్ణయించారు. గ్రామాల్లో ఈ దఫా చిన్న తరహా చెరువుల్లో పనులు చేపట్టకుండా ఇతర పనులకు ఉపాధి హామీ

మిగతా 8వ పేజీలో...

బాలికలు, మహిళలను చిన్నచూపు చూసే ధోరణి మారింది

- జాతీయ బాలికల దినోత్సవంలో అర్బన్ ఎమ్మెల్యే ధన్‌పాల్ సూర్యనారాయణ



కార్యక్రమంలో మాట్లాడుతున్న అర్బన్ ఎమ్మెల్యే ధన్‌పాల్.. చిత్రంలో నగర మేయర్ నీతూకిరణ్

నిజామాబాద్ అర్బన్, జనవరి 24 (ఆంధ్రజ్యోతి): గతంలో ఆడపిల్లలను, మహిళలను సమాజం చిన్న చూపు చూసేదని ప్రస్తుతం ఆ ధోరణి మారిందని అర్బన్ ఎమ్మెల్యే ధన్‌పాల్ సూర్యనారాయణ అన్నారు. శుక్రవారం జిల్లా మహిళా శిశు సంక్షేమ దివ్యాంగుల వయోవృద్ధుల శాఖ ఆధ్వర్యంలో జాతీయ బాలికల దినోత్సవాన్ని పురస్కరించుకొని బేటీ బచావో బేటీ పఢావో కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమం ప్రారంభించి పది సంవత్సరాలు పూర్తయిన సందర్భంగా నగరంలోని పాత కలెక్టరేట్ మైదానం నుంచి న్యూ అంబేద్కర్ భవన్ వరకు ర్యాలీ నిర్వహించారు. అనంతరం న్యూ అంబేద్కర్ భవన్‌లో నిర్వహించిన జాతీయ బాలికల దినోత్సవాన్ని అర్బన్ ఎమ్మెల్యే ధన్‌పాల్ సూర్యనారాయణ, నగర మేయర్ నీతూ కిరణ్, రాష్ట్ర మహిళా కమిషన్ మెంబర్ సుదం లక్ష్మితో కలిసి జ్యోతి ప్రజ్వలన చేసి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. గతంలో మహిళలంటే చిన్నచూపు ఉండేదని కానీ ప్రస్తుతం ప్రభుత్వాలు.. ఆడపిల్లలు, మహిళల సంక్షేమానికి చేపడుతున్న అనేక పథకాల వల్ల సమాజంలో మహిళలకు గౌరవం పెరిగిందన్నారు. వంటింటికే పరిమితమైన ఆడవారు ప్రస్తుతం అంతరిక్ష స్థాయికి ఎదిగారని అన్నారు. బాల్య వివాహాలను అరికట్టడంలో సమన్వయంతో పనిచేయాలని సూచించారు. నగరమేయర్ నీతూకిరణ్ మాట్లాడుతూ.. ఆడపిల్లలు, మహిళలు ఎదగాలంటే కుటుంబ సభ్యుల సహకారం అవసరమన్నారు. ఈ సందర్భం గా జడ్పీహెచ్‌ఎస్ మల్లారం, మానవతా సదన్, విజయ హైస్కూల్, మైనార్టీ వెల్ఫేర్ పాఠశాలల విద్యార్థులు ప్రదర్శించిన సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి. అత్యాచారాలు, మహిళలపై జరుగుతున్న అన్యాయాలపై విద్యార్థులు ప్రదర్శించిన ప్రదర్శనలు ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి. ఈ కార్యక్రమంలో జిల్లా సంక్షేమ అధికారి రసూల్‌బీ, డీఎంఅండ్ హెచ్‌వో రాజశ్రీ, ఆల్ ఇండియా రేడియో డీడీ మోహన్‌దాస్, జీఈసీవో భాగ్యలక్ష్మి, తదితరులు పాల్గొన్నారు.



నగరంలో ర్యాలీ నిర్వహిస్తున్న ఉద్యోగులు



న్యూ అంబేద్కర్ భవన్‌లో విద్యార్థినుల సాంస్కృతిక ప్రదర్శనలు



దోమకొండ కోటలో సినీనటి ప్రియాంక చోప్రా

దోమకొండ, జనవరి 24 (ఆంధ్రజ్యోతి): కామారెడ్డి జిల్లాలోని దోమకొండ గడికోటలో శుక్రవారం ప్రముఖ సినీ నటి ప్రియాంకచోప్రా సందడి చేశారు. తెల్లవారుజామున 2 గంటల నుంచి ఉదయం 6 గంటల వరకు ఆమె గడి కోటలో ఉన్నారు. ఈ సందర్భంగా అక్కడి శివాలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించి మొక్కులు తీర్చుకున్నారు. కోట తరపున సిబ్బంది తీర్థప్రసాదాలు అందజేశారు. కోట సీనియర్ మేనేజర్ బాబ్జి హీరోయిన్‌కు జ్ఞాపికను అందజేశారు. అద్దాల బంగ్లా, సొరంగ మార్గం, చుట్టూ కందకం, కోట చరిత్రను వివరించారు. కాగా.. ప్రియాంకచోప్రా కోట వారసురాలు అయిన ఉపాసన భర్త, ప్రముఖ సినీ హీరో రాంచరణ్‌తో కలిసి గతంలో ఓ సినిమాలో నటించిన విషయం తెలిసిందే.. కాగా.. దోమకొండకు ప్రముఖ సినీ నటి ప్రియాంక చోప్రా వచ్చిందన్న విషయం తెలుసుకున్న స్థానికులు ఉదయమే కోట వద్దకు పెద్ద ఎత్తున చేరుకున్నారు. ఆమెను చూసేందుకు ఎగబడ్డారు.

రూ. వెయ్యి కోసం ఇద్దరి హత్య!

- జంట హత్య కేసులను ఛేదించిన రూరల్ పోలీసులు
- స్నేహితులే నిందితులు
- వివరాలు వెల్లడించిన ఏసీపీ

ఖిల్లా, జనవరి 24 (ఆంధ్రజ్యోతి): కేవలం వెయ్యి రూపాయల కోసం ఓ వ్యక్తిని, అతని ఆచూకీ అడిగిన మరో వ్యక్తిని స్నేహితులే హత్య చేసిన ఘటన జిల్లా కేంద్రంలో వెలుగు చూసింది. ఇటీవల జరిగిన డబుల్ మర్డర్ కేసు వివరాలను ఏసీపీ రాజవెంకట్ రెడ్డి శుక్రవారం తన కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వెల్లడించారు.

మిగతా 8వ పేజీలో...



జంట హత్య కేసు వివరాలు వెల్లడిస్తున్న నిజామాబాద్ ఏసీపీ రాజవెంకట్‌రెడ్డి

మోతెలో పర్యావరణంపై అవగాహన

వేల్పూర్, జనవరి 24 (ఆంధ్రజ్యోతి) : మండలంలో మోతె ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో కౌన్సిల్ ఫర్ గ్రీన్ రివల్యూషన్ ఆధ్వర్యంలో శుక్రవారం పర్యావరణ, వృక్ష సంపదపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ముఖ్యఅతిథిగా హాజరైన ఎంఈవో రేణుక మాట్లాడుతూ పర్యావరణ పరిరక్షించు కోవాల్సిన బాధ్యత విద్యార్థి దశ నుంచే అలవాటు చేసుకో వాలని, మొక్కల పెంపకాన్ని అభివృద్ధి చేసుకోవాలని సూచించారు. కౌన్సిల్‌ఫర్ గ్రీన్ రెవల్యూయేషన్ సభ్యుడు అనుదీప్ మాట్లాడుతూ ఇంకుడు గుంతలు ప్రతీ విద్యార్థులు ఏర్పాటు చేసుకోవాలని, ప్లాస్టిక్ వ్యర్థాలను ఉపయోగించుకోరాదని సూ చించారు. కార్యక్రమంలో ఎంఈవో రేణుక, కౌన్సిల్ ఫర్ గ్రీన్ రెవల్యూయేషన్ సభ్యుడు అనుదీప్, ట్రైనర్ జ్ఞానేశ్వర్, హెచ్ఎం వైద్యగణేష్, ఉపాధ్యాయులు కృష్ణవేణి, కవిత, శ్రావణి, గణేష్, రత్నం, నర్సింహరావు, సురేష్‌కుమార్ ఉన్నారు.

పెండింగ్ బకాయిలను తక్షణమే చెల్లించాలి

కమ్మర్‌పల్లి, జనవరి 24: (ఆంధ్రజ్యోతి)పెండింగ్‌లో ఉన్న బిల్లులను తక్షణమే చెల్లించేలా ప్రభుత్వం చర్యలు చేపటాలని డెమొక్రటిక్ టీచర్స్ ఫెడరేషన్ జిల్లా నాయకులు జిల్లా కౌన్సిలర్ పి.దాసు, షేక్‌మదార్‌లు డిమాండ్ చేశారు. శుక్రవారం కమ్మర్‌పల్లి మండలం చౌట్‌పల్లి, బషీరాబాద్ ఉన్నత పాఠశాలల్లో నూతన సంవత్సర క్యాలండర్ ఆవిష్కరణ కార్యక్రమంలో పాల్గొన్నారు. పెండిగ్‌లో ఉన్న డీఏలను వెంటనే విడుదలచేయాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.

ఘనంగా డ్రైవర్స్ డే కార్యక్రమం

పెర్కిట్, జనవరి24(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని ఆర్టీసీ బస్‌డిపోలో శుక్రవారం జాతీయ రోడ్డు భద్రత మాసోత్సవాలలో భాగంగా డ్రైవర్స్ డే కార్యక్రమాన్ని డిపో మేనేజర్ రవికుమార్ ఆధ్వర్యంలో శుక్రవారం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి మోటార్ వెహికిల్ ఇన్‌స్పెక్టర్ వివేకానందరెడ్డి ముఖ్యఅతిథిగా పాల్గొని డ్రైవర్‌లకు పలు సూచనలు చేశారు. కార్యక్రమంలో ట్రాఫిక సీఐ రమేష్, అసిస్టెంట్ మోటర్ వెహికిల్ ఇన్‌స్పెక్టర్ రోహిత్‌రెడ్డి, సాగర్, ట్రాఫిక్ ఇన్‌స్పెక్టర్ పారు, గంగాకిషన్, విష్ణువర్ధన్‌రెడ్డి, చక్రవర్తి పాల్గొన్నారు.

వ్యక్తి ఆత్మహత్య

బోధన్‌రూరల్, జనవరి 24 (ఆంధ్రజ్యోతి): బోధన్ మండల శివారులోని ఇటుక బట్టిలో పని చేస్తున్న రమాకాంత్(45)అనే వ్యక్తి సమీపంలోని చెట్టుకు గురువారం అర్ధరాత్రి ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకున్నట్లు రూరల్ ఎస్ఐ మచ్చేందర్ రెడ్డి తెలిపారు. మృతుడి భార్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి అన్ని కోణాల్లో దర్యాప్తు చేసుకున్నామన్నారు. మృతదేహన్ని పోస్టుమార్టం నిమిత్తం బోధన్ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించామన్నారు.

ఎస్సారెస్పీ ఉద్యోగులకు క్రీడలు



పోచంపాడ్‌లో క్యారం ఆడుతున్న ఇరిగేషన్ ఉద్యోగుల

మెండోర, జనవరి 24 (ఆంధ్రజ్యోతి): మండలంలో శ్రీరాం సాగర్ ప్రాజెక్టు డివిజన్ సర్కిల్ ఉద్యోగులకు అంతర్గత క్రీడలను ప్రాజెక్టు ఈఈ చక్రపజాణి ప్రారంభించారు. ఈ సందర్భంగా గణతంత్ర్య దినోత్సవం పురస్కరించుకొని ఎస్సారెస్పీ ఉద్యోగులకు చదరంగం క్యారం పోటీలు నిర్వహించినట్టు పోటీల్లో ఉద్యోగులు ఉత్సాహంగా పాల్గొన్నారని తెలిపారు. గెలుపొందిన ఉద్యోగులకు గణతంత్ర్య దినోత్సవం రోజు బహుమతులు ప్రధానం చేస్తామని తెలిపారు. కార్యక్రమంలో డీఈఈలు గణేష్, గంగాభూషణ్, రఘుపతి, సుకుమార్, ఏఈఈలు సుశాంత్, మామిడి వంశీ, కొండ వంశీ, విన్యాస్, శ్యామ్, అరవింద్, శాంతన్, సూపరిండెంట్ రవీందర్ పాల్గొన్నారు.

సీసీ కెమెరాలు ఏర్పాటు చేసుకోవాలి



సీసీ కెమెరా క్యాబిను ప్రారంభిస్తున్న ఎస్ఐ అనీల్ రెడ్డి

కమ్మర్‌పల్లి, జనవరి 24: నేరాలను అదుపు చేయడంలో సీసీ కెమెరాలు కీలక పాత్ర పోషిస్తాయని ఒక్క సీసీ కెమెరా వందమంది పోలీసులతో సమానంగా పనిచేస్తాయని కమ్మర్‌పల్లి ఎస్ఐ అనిల్‌రెడ్డి అన్నారు శుక్రవారం మండలంలోని చౌట్‌పల్లి లో గ్రామానికి చెందిన దాత గడ్డం మహేందర్ (రిలయన్స్ కాలేజీఆఫ్ హోటర్ మేనేజ్‌మెంట్ నిజామాబాద్, కరీంనగర్) 95 వేల రూపాయల వ్యయంతో సొంత ఊరికి సమకూర్చిన 8 సీసీ కెమెరాలను ఎస్ఐ ప్రారంభించారు. కార్యక్రమంలో చౌట్‌పల్లి ప్రభుత్వ ఆసుపత్రి వైద్యురాలు డాక్టర్ స్పందన, మండల విద్యాధికారి ఎన్.ఆంధ్రయ్య, పంచాయతీ కార్యదర్శి శాంతికుమార్, వీడీసీ అధ్యక్షుడు కొమ్ముల రాజేందర్ రెడ్డి, ఉపాధ్యక్షుడు శ్రీనివాస్, కోశాధికారి రమేష్, నవీన్‌గౌడ్, కమిటీ సభ్యులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

బాధిత కుటుంబానికి చేయూత

ఎడపల్లి, జనవరి24(ఆంధ్రజ్యోతి): ఎడపల్లి మండలంలోని వడ్డాపల్లి గ్రామానికి చెందిన మాజీ ఉపసర్పంచ్ కొమ్మేటి విజయ సత్యం శుక్రవారం బాధిత కుటుంబానికి చేయూతను అందించారు. గ్రామానికి చెందిన షేక్ మహబూబ్ ఇటీవల బ్రెయిన్ స్ట్రోక్‌తో మరణించడంతో విషయం తెలుసుకున్న గ్రామ ఉపసర్పంచ్ విజయ భర్త సత్యం మానవత్వాన్ని చాటుకుని, ఆ కుటుంబానికి 25 కిలోల బియ్యంతోపాటు, నెలకు సరిపడా ఇతర నిత్యవసర సరుకులను అందజేశారు. కార్యక్రమంలో షేక్ సిరాజ్, షేక్ ఖలీల్, షేక్ జమీర్, ఎర్ర శేఖర్, పృథ్వీరాజ్ తదితరులు ఉన్నారు.వస్తువులను అందజేశారు.

వాటర్‌ప్లాంట్ ప్రారంభం

వర్ని,జనవరి24(ఆంధ్రజ్యోతి): వర్ని మండల కేంద్రంలో శుక్రవారం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో వాటర్ ప్లాంట్‌ను ప్రారంభించారు. ఎంపీటీసీ ఫోరం రాష్ట్ర మాజీ అధ్యక్షులు యలమంచిలి శ్రీనివాస్ రావు చేతుల మీదుగా ఈ కార్యక్రమం నిర్వహించారు. మల్లంపాటి సుజాత మెమోరియల్ చారిటబుల్ ట్రస్ట్ హైదరాబాద్ వారు కీ.శే మల్లంపాటి సుజాత జ్ఞాపకార్థం ఈ ప్లాంట్‌ను ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమంలో ట్రస్టు మేనేజింగ్ ట్రస్టీ శివ శంకర్, శ్రీధర్, కిషోర్, అజయ్, మొహినోద్దీన్, సంజీవ్, ప్రకాశ్ తదితరులు పాల్గొన్నారు.

బైరాపూర్ నుంచి పండరీపూర్‌కు పాదయాత్ర

బీర్కూర్, జనవరి 24 (ఆంధ్రజ్యోతి): బీర్కూర్ మండలం బైరాపూర్ విఠలేశ్వర ఆలయం నుంచి మహారాష్ట్రలోని పుణ్యక్షేత్రమైన పండరీపూర్‌కు శుక్రవారం భక్తులు పాదయాత్ర చేపట్టారు. ప్రతి సంవత్సరం బైరాపూర్ నుంచి వందలాది మంది భక్తులు పండరీపూర్‌కు పాదయాత్ర చేపడతారు. ఈ ఏటా కూడా వందలాది మంది భక్తులు కాలినడకన పండరీపూర్‌కు తరలివెళ్లారు. భజనలు చేస్తూ, భక్తి పాటలు పాడుతూ పాదయాత్ర చేపట్టారు.

అనర్హులకు రేషన్ కార్డులు మంజూరయ్యాయి



హంగర్గ ఫారంలో అధికారులను నిలదీస్తున్న గ్రామస్తులు

కోటగిరి, జనవరి 24 (ఆంధ్రజ్యోతి) : నిరుపేదలకు అందాల్సిన సంక్షేమ పథకాలు అనర్హులకు మంజూరు కావడం పై ప్రజలు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. పోతంగల్ మండలంలోని హంగర్గఫారంలో శుక్రవారం నిర్వహించిన గ్రామసభలో రేషన్‌కార్డులపై అధికారులను గ్రామస్తులు నిలదీశారు. పదేళ్ళక్రితం దరఖాస్తు చేసుకున్న వారికి రేషన్ కార్డులు మంజూరు కాకపోగా, ఇటీవల దరఖాస్తు చేసుకున్న వ్యక్తులకు రేషన్ కార్డులు రావడం పై గ్రామస్తులు తీవ్ర అభ్యంతరాలు వ్యక్తం చేశారు. కార్యక్రమంలో ఎంపీడీఓ శ్రీనివాస్ రెడ్డి, తహసీల్దార్ గంగాధర్, వ్యవసాయ అధికారులు రాజు, నిషిత, ఎంపీఓ చందర్, ఏపిఓ గంగారాం తదితరులు పాల్గొన్నారు.

మోస్రా : మండలంలోని గోవూర్, చే సెంబర్ దుబ్బతండా గ్రామాల్లో ప్రజాపాలన గ్రామసభ కార్యక్రమానికి వచ్చిన ప్రభుత్వ అధికారులు ఇందిరమ్మ ఇళ్లు, రైతు భరోసా, ఉపాధి కూలీల విషయాలు చదివి వినిపించారు. అనంతరం గ్రామస్తులు ఇంతకు ముందు ప్రభుత్వం డబుల్‌బెడ్ రూమ్ చెక్కులు తీసుకున్న లబ్దిదారుల యొక్క పేర్లు మళ్లీ ఇందిరమ్మ ఇళ్లకు కూడా అర్హులుగా ప్రకటించారు. అర్హులందరికీ న్యాయం చేయాలని ప్రజలు కోరారు. కార్యక్రమంలో మండల అధికారి రమేష్ రాథోడ్, ఆర్ఐ నాగమణి, దుబ్బతండా వీరన్న, ఆర్ల రవీందర్ రెడ్డి, కొట్టాల శ్రీనివాస్ రెడ్డి పాల్గొన్నారు.

బోధన్‌రూరల్ : బోధన్ పట్టణంలోని అర్హులైన ప్రతి ఒక్కరికి ప్రభుత్వ సంక్షేమ పథకాలు అందుతాయని బోధన్ మున్సిపల్ ఏఈ శ్రీనివాస్ అన్నారు. శుక్రవారం బోధన్ పట్టణంలోని పలు వార్డులలో ప్రజాపాలన వార్డుసభల కార్యక్రమంలో పాల్గొన్నారు. సాలూర, బోధన్ మండలంలోని పలు గ్రామాలలో గ్రామసభలు నిర్వహించారు. ఈ సందర్భంగా బోధన్ ఎంపీడీవో బాల గంగాధర్, ఎంపీవో మధుకర్‌లు అర్హుల జాబితాను చదివి వినిపించారు.

ఆర్మూర్‌రూరల్: ప్రభుత్వం అందజేస్తున్న సంక్షేమ పథకాలను అర్హులందరికీ అందించి లబ్ధి చేకూర్చాలన్నదే ప్రభుత్వ ఉద్దేశమని జిల్లా గ్రంథాలయ సంస్థ మాజీచైర్మన్ మార చంద్రమోహన్ అన్నారు. శుక్రవారం ఆర్మూర్ మండలం చేపూర్, హరిపూర్ గ్రామాల్లో గ్రామసభలు నిర్వహించారు. అందరి సమక్షంలో ఏపీవో ఉమ్మెడ సురేష్ చదివి వినిపించారు. జాబితాలో పేర్లు లేని వారు తిరిగి దరఖాస్తు చేసుకో వాలని సూచించారు. కార్యక్రమంలో ప్రత్యేక అధికారి డాక్టర్ లక్ష్మం ప్రభాకర్, తహసీల్దార్ గజానన్, ఎంపీవో శ్రీనివాస్, మండల కాంగ్రెస్ అధ్యక్షుడు చిన్నారెడ్డి, ఆర్మూర్ మార్కెట్ కమిటీ వైస్‌చైర్మన్ ఇట్టెం జీవన్, మార్కెట్ కమిటీ డైరెక్టర్ అమృతరావు, మాజీజడ్పీటీసీ గంగాధర్, పాల్గొన్నారు.

వర్ని: జలాల్‌పూర్ గ్రామంలో గ్రామసభ రసాభాసగా జరిగింది. ఎన్ని ప్రభుత్వాలు మారిన ఎన్ని గ్రామసభలు పెట్టిన మా జీవితం జిరాక్స్‌లు ఇవ్వడానికి, అప్లికేషన్‌లు పెట్టడానికే సరిపోతుందని ప్రజలు ఆగ్రహం వ్యక్తం చేశారు. గ్రామసభలలో గందరగోళం నెలకొంది. అధికారులను పథకాలపై ప్రజలు ప్రశ్నించారు.

వేల్పూర్ : మండలంలోని పచ్చల నడ్కుడ గ్రామంలో శుక్రవారం జరిగిన గ్రామసభ రసాభాసగా జరిగింది. ఉదయం స్పెషల్ ఆఫీసర్ భారతి, ఎంపీవో సాయిలు గ్రామసభను నిర్వహించారు. రేషన్‌కార్డులు, ఇందిరమ్మ ఇళ్లు, ఇందిరమ్మ ఆత్మీయ భరోసా పథకాలలో ఎంపికైన లబ్ధిదారుల జాబితాను చదివి వినిపించారు. దీంతో జాబితాలో 90 శాతం వరకు అనర్హుల పేర్లు ఉన్నాయని, నిజమైన అర్హుల పేర్లు ఎందుకు లేవని గ్రామస్థులతో కలిసి బీఆర్ఎస్ నాయకులు అధికారులను నిలదీశారు. దీంతో కాంగ్రెస్, బీఆర్ఎస్ నాయకుల మధ్య తీవ్రస్థాయిలో వాగ్వాదం జరిగింది. కార్యక్రమంలో స్పెషల్ ఆఫీసర్ బారతి, ఎంపీవో సాయిలు, డీటీ మధు, ఏఈవో స్నేహశ్రీ, గ్రామకార్యదర్శి నవనీత ఉన్నారు. రైతు భరోసాకు ఎంపికైన నూతన పట్టాదారులు తమ పూర్తి వివరాలను అందజేయాలని మండల వ్యవసాయాధికారి సాయికృష్ణ తెలిపారు.

నసురుల్లాబాద్: నసురుల్లాబాద్ మండలంలోని మైలారం, నెమలి గ్రామాలలో శుక్రవారం అధికారులు గ్రామసభలు నిర్వహించారు. కాగా ఆయా గ్రామాలలో రేషన్ కార్డులు రాని లబ్దిదారులు అధికారులను నిలదీశారు. దీంతో గ్రామాలలోని లబ్దిదారులు అధికారులను నిలదీశారు. సర్వే చేసిన రేషన్ కార్డుల జాబితాలో తమ పేర్లు రాలేదని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రభుత్వం కాలయాపన చేస్తుందన్నారు.

హామీలు అమలు చేస్తున్నాం

● మోర్తాడ్ గ్రామసభలో ఈరవత్రి అనిల్



మోర్తాడ్ గ్రామసభలో మాట్లాడుతున్న ఈరవత్రి అనిల్

మోర్తాడ్, జనవరి24(ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ఆర్థిక పరిస్థితి బాగాలేకున్నా సీఎం రేవంత్‌రెడ్డి ఆర్థిక క్రమశిక్షణతో ప్రజలకు ఇచ్చిన హామీలు నెరవేరుస్తున్నారని రాష్ట్ర ఖనిజాభివృద్ధి సంస్థ చైర్మన్ ఈరవత్రి అనిల్ అన్నారు. శుక్రవారం మోరాడ్ గ్రామసభకు ఆయన ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఈరవత్రి అనిల్ మాట్లాడుతూ పదేళ్ళ కేసీఆర్ పాలనలో రూ.7లక్షల కోట్ల అప్పులు చేసి రాష్ట్రాన్ని దివాల స్థితికి తెచ్చారని ఆరోపించారు. అయిన కాంగ్రెస్ పార్టీకి పట్టం కట్టిన ప్రజలకు ఇచ్చిన హామీలు వంతుల వారీగా అమలు చేస్తున్నామని వివరించారు. ప్రత్యేక అతిథిగా పాల్గొన్న జిల్లా కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర సహకార సంఘం సంస్థ చైర్మన్ మానాల మోహన్‌రెడ్డి మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీ పాలన వల్లనే పేదప్రజలకు సంక్షేమ పథకాలు అందుతాయని, అన్నారు. డబుల్‌బెడ్ ఇళ్లు ఇవ్వనోడు ఇందిరమ్మ ఇళ్ళ గురించి మాట్లాడే అర్హత లేదని బీఆర్ఎస్ పార్టీలకు చురకలు అంటించారు. కార్యక్రమంలో కమ్మర్‌పల్లి ఎఎంసీ చైర్మన్ పాలెపు నర్సయ్య, ఎంపీడీవో తిరుమల, తహసీల్దార్ సత్యనారాయణ ప్రసంగించారు. అనంతరం సంబంధిత అధికారులు రేషన్‌కార్డులు, ఇందిరమ్మ ఇళ్ల దరఖాస్తులు చేసుకున్న వారి పేర్లు సభలో చదివి వినిపించారు. కార్యక్రమంలో రాష్ట్ర విత్తనాభివృద్ధి సంస్థ డైరెక్టర్ రొక్కం మురళీ, మండల పార్టీ అధ్యక్షుడు ముత్యాల రాములు, ముత్తెన్న, సుంకెట రవి, భూమన్న, గిర్మాజీ గంగాధర్, పుప్పాల అశోక్, గిర్మాజీ గోపి, జక్కం అశోక్ తదితరులు పాల్గొన్నారు.

క్రీడా పరికరాలు అందజేత

ఆర్మూర్‌టౌన్ : పట్టణంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఈఆర్ ఎడ్యూకేషన్ సర్వీసెస్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో శుక్రవారం విద్యార్థులకు క్రీడా పరికరాలు అందజేశారు. ఈ సందర్భంగా ఫౌండేషన్ అధ్యక్షుడు ఈరవత్రి రాజశేఖర్ మాట్లాడుతూ విద్యార్థులు విద్యతో పాటు క్రీడలలో పాల్గొనాలని అన్నారు. విద్యార్థులు క్రీడల్లో ప్రతిభ కనబరిచి జిల్లా, రాష్ట్ర జాతీయ స్థాయిలో రాణించాలని ఆయన సూచించారు. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ విజయానంద్‌రెడ్డి, ఈఆర్ ఫౌండేషన్ సభ్యులు అర్గుల్ సురేష్, నిట్ శేఖర్, గంగామోహన్, పీడీఎస్‌యూ జిల్లా అధ్యక్షుడు నరేందర్, ఇష్తాఫోద్దిన్, గంగారెడ్డి, మహిపాల్‌రెడ్డి, శ్రీకాంత్, కళాశాల అధ్యాపకులు పాల్గొన్నారు.

విద్యార్థుల వివరాలు అపార్‌లో నమోదు చేయాలి

● జిల్లా సెక్టోరియల్ అధికారి శ్రీధర్

బోధన్‌రూరల్,జనవరి24(ఆంధ్రజ్యోతి): విద్యార్థుల సమగ్రమైన వివరాలు అపార్‌లో నమోదు చేయాలని జిల్లా సెక్టోరియల్ అధికారి శ్రీధర్ అన్నారు. శుక్రవారం బోధన్‌పట్టణంలోని ఉప విద్యాశాఖ అధికారి కార్యాలయంలో ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పాఠశాలలోని రికార్డులు, ఆధార్ కార్డు వివరాలను ఒకసారి చూసుకుంటూ సరిగా ఉన్నాయని ఆ విద్యార్థుల అపార్ ఐడీ జనరేట్ చేయాలని సూచించారు. మిగిలిన విద్యార్థుల వివరాలను రాష్ట్ర సంచాలకుల నుంచి వచ్చిన ప్రొసిడింగ్ ఆధారంగా విద్యార్థుల సంబంధిత ఆధారాలతో మండల స్థాయిలో విద్యార్థుల వివరాలను సరి చేయాలన్నారు. విద్యార్థుల సమగ్రమైన వివరాలను అపార్‌లో నమోదు చేయబడతాయని, సందేహాలను నివృత్తి చేసుకుని విద్యార్థుల యొక్క భవిష్యత్‌ను దృష్టిలో పెట్టుకుని కచ్చితమైన వివరాలతో అపార్ క్రియేట్ చేయాలని వివరించారు. ఈ కార్యక్రమంలో బోధన్ మండల విద్యాశాఖ అధికారి నాగయ్య, కాంప్లెక్స్ ప్రధానోపాధ్యాయులు రత్నకర్, కోఆర్డినేటర్ నగేష్, సీఆర్పీలు విజయ్ బాబు, యుసుఫ్, శివానంద్, విజయ, రేఖ, దేవానంద్, ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలల ప్రధానోపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

ప్రతి ఇంటిపై జాతీయ జెండాను ఎగురవేయాలి

బోధన్‌రూరల్, జనవరి 24 (ఆంధ్రజ్యోతి): హర్ ఘర్ తిరంగా సందర్భంగా ప్రతి ఇంటిపై జాతీయ జెండాను ఎగురవేయాలని బీజేపీ నాయకులు కందికట్ల వాసు అన్నారు. శుక్రవారం హర్ ఘర్ తిరంగా కార్యక్రమంలో భాగంగా ఏకచక్ర నగర్‌లో ఇంటింటికి జాతీయ జెండాలను పంపిణీ చేశారు. ప్రతి ఇంటిపై జాతీయ జెండా ఎగురవేయాలని పేర్కొన్నారు. త్రివర్ణ పతాకాన్ని ఇంటిపై రెపరెపలాడించడం ద్వారా భారతీయులందరిలో జాతీయ భావన కలుగుతుందన్నారు. భారత జాతి నిర్మాణంలో మనమంత భాగస్వాములుకావాలని జాతీయ జెండాలను పంపిణీ చేశారు. కార్యక్రమంలో బీజేపీ నాయకులు గుమ్మల ప్రకాష్, పాండవుల భూమయ్య, భూమేష్, రాజు, అశోక్, సాయి, జంగం రాజు, బాలకృష్ణ, యోగి, గణేష్ తదితరులు పాల్గొన్నారు.

మెరుగైన వైద్య సేవలు అందించడంలో ముందుండాలి

బోధన్‌రూరల్, జనవరి 24 (ఆంధ్రజ్యోతి): ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందించడంలో వైద్యులు ముందుండాలని జిల్లా ఐఈటీ అధ్యక్షుడు డాక్టర్ సూర్యరావు అన్నారు. బోధన్ పట్టణానికి చెందిన సీనియర్ ప్రముఖ పీడీయట్రిషన్ డాక్టర్ సూర్యరావు ఐఈటీ జిల్లా అధ్యక్షులుగా గురువారం ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. సెక్రెటరీగా డాక్టర్ శ్రీకాంత్, ట్రెజరర్‌గా డాక్టర్ దీపక్ రాథోడ్‌లను ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా అధ్యక్షులు సూర్యరావు మాట్లాడుతూ ప్రజలకు అన్ని వేళల అందుబాటులో ఉంటూ సేవ కార్యక్రమాలు, హెల్త్ క్యాంప్‌లు నిర్వహించాలని సూచించారు. గణతంత్ర దినోత్సవం సందర్భంగా జిల్లా ప్రభుత్వ ఆసుపత్రిలో రక్తదాన శిబిరాన్ని నిర్వహిస్తున్నామని, ఈ కార్యక్రమంలో సభ్యులు అధిక సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలన్నారు.

విద్యార్థులు చదువులో రాణించాలి

● జిల్లా విద్యాశాఖ అధికారి అశోక్

భీమ్‌గల్‌రూరల్, జనవరి24(ఆంధ్రజ్యోతి): విద్యార్థులు చదువులో రాణించి చదువు చెప్పిన ఉపాధ్యాయులకు, తల్లిదండ్రులకు మంచిపేరు ప్రతిష్టలు తేవాలని జిల్లా విద్యాశాఖ అధికారి అశోక్ సూచించారు. మండలంలోని దేవక్కపేట్ గ్రామంలో శుక్రవారం ప్రాథమిక పాఠశాలలో పదవ తరగతి ప్రారంభోత్సవ కార్యక్రమానికి ఆయన ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. పదవ తరగతికి అనుమతి ఇప్పించిన డీఈవోను పాఠశాల అభివృద్ధి కమిటీ ఉపాధ్యాయులు, గ్రామాభివృద్ధి కమిటీ సభ్యులు ఘనంగా సన్మానించారు. అదే గ్రామానికి చెందిన కంటే సాయన్న ఉన్నత చదువులు చదివి హైదరాబాద్‌లో స్థిరపడ్డారు. చదువుకున్న పాఠశాలకు అవసరం నిమిత్తం రూ.లక్ష విరాళం ఇచ్చారు. దీంతో ఆయనను గ్రామ ప్రజలు అభినందించారు. కార్యక్రమంలో ఎంపీడీవో గంగుల సంతోష్‌కుమార్, ఉపాధ్యాయులు, విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

మున్సిపల్ పరిధిలో ముగిసిన వార్డుసభలు

ఆర్మూర్‌టౌన్, జనవరి 24 (ఆంధ్రజ్యోతి): మున్సిపల్ పరిధిలోని పలు వార్డులలో శుక్రవారంతో వార్డుసభలు ముగిశాయి. మున్సిపల్ పరిధిలోని 11, 12, 16, 22, 29, 36వార్డులలో సభలు నిర్వహించి లబ్ధిదారుల నుంచి వినతి పత్రాలను స్వీకరించారు. నాలుగు రోజుల పాటు వార్డుసభలు నిర్వహించి దరఖాస్తులు స్వీకరించారు.

విద్యార్థుల్లో అభ్యసన సామర్థ్యాన్ని పెంపొందించాలి



కల్లూర్ పాఠశాలను తనిఖీ చేస్తున్న బోధన్ సబ్‌కలెక్టర్

కోటగిరి, జనవరి 24 (ఆంధ్రజ్యోతి) : విద్యార్థుల్లో అభ్యసన సామర్థ్యాన్ని పెంపొందించేందుకు ఉపాధ్యాయులు తమ వంతు కృషి చేయాలని బోధన్ సబ్ కలెక్టర్ వికాస్ మహతో సూచించారు. పోతంగల్ మండలంలోని కల్లూర్ జిల్లా పరిషత్ పాఠశాలను శుక్రవారం సబ్ కలెక్టర్ ఆకస్మిక తనిఖీ నిర్వహించారు. విద్యార్థుల, ఉపాధ్యాయుల హాజరు పట్టికలు, రికార్డులు పరిశీలించారు. విద్యార్థుల అభ్యసన సామర్థ్యాన్ని స్వయంగా పరిశీలించారు. తరగతి గదులను పరిశీలించి విద్యార్థులను పలు ప్రశ్నలు అడిగి చదువుపై ఆరా తీశారు. చేతిరాత బాగుండేలా విద్యార్థులను తీర్చిదిద్దాలని ఉపాధ్యాయులకు సూచించారు. సబ్జెక్టులు ఏ మేరకు పూర్తయ్యాయని విద్యార్థులను అడిగి తెలుసుకున్నారు. పదవ తరగతి పరీక్షల్లో వంద శాతం ఉత్తీర్ణత సాధించేలా ఉపాధ్యాయులు కృషి చేయాలని సూచించారు. ఉపాధ్యాయుల సమయపాలన పాటించాలన్నారు. మెనూ ప్రకారం మధ్యాహ్న భోజనం అందించాలన్నారు. ఆయన వెంట ఎంఈఓ లోల శంకర్, ఉపాధ్యాయులున్నారు.

గుర్తు తెలియని వాహనం ఢీకొని వ్యక్తి మృతి

పెద్ద కొడప్‌గల్, జనవరి 24 (ఆంధ్రజ్యోతి): గుర్తు తెలియని వాహనం ఢీకొని వ్యక్తి మృతి చెందిన ఘటన గురువారం రాత్రి జుక్కల్ మండలం పెద్ద ఏడ్గి గ్రామ శివారులో చోటు చేసుకుంది. ఎస్ఐ కథనం ప్రకారం వివరాలు..... జుక్కల్ మండలం పడంపల్లి గ్రామానికి చెందిన కిరేవార్ నాగనాథ్ గురువారం సాయంత్రం చికెన్ తీసుకరావడానికి పెద్ద ఏడ్గి గ్రామానికి వెళ్లారని, చికెన్ తీసుకుని వస్తున్న తరుణంలో గుర్తు తెలియని వాహనం ఢీకొట్టడంతో అక్కడికక్కడే మృతి చెందినట్లు ఎస్ఐ తెలిపారు. మృతుని భార్య గంగమణి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

ఎల్లారెడ్డి మార్కెట్ కమిటీ పాలకవర్గ సమావేశం

ఎల్లారెడ్డి, జనవరి 24 (ఆంధ్రజ్యోతి): ఎల్లారెడ్డి పట్టణ కేంద్రంలోని మార్కెట్ కమిటీ కార్యాలయంలో శుక్రవారం మార్కెట్ కమిటీ చైర్మన మారెడ్డి రజితారెడ్డి అధ్యక్షతన పాలకవర్గ సమావేశం నిర్వహించారు. ఆదాయ వ్యయాలను కార్యదర్శి శ్రీకాంత్ చదివి వినిపించారు. సమావేశంలో పలు పనులకు సంబంధించిన మార్కెట్ కమిటీ ఆదాయం పెంపొందించుటకు కృషి చేయాలని, ప్రభుత్వ సంస్థల నుంచి మార్కెట్ కమిటీకి వచ్చిన ఆదాయంపై, మార్కెట్ కమిటీ యందు అభివృద్ధి పనులు చేపట్టేందుకు ఇతర రాష్ట్రాలలోని మార్కెట్ కమిటీలకు వెళ్లేందుకు గురించి పలు అంశాలపై చర్చించి తీర్మానించినట్లు కార్యదర్శి శ్రీకాంత్ తెలిపారు. కార్యక్రమంలో వైస్ చైర్మన్ జొన్నల రాజు, డైరెక్టర్లు, సిబ్బంది శశికాంత్ తదితరులు పాల్గొన్నారు.

స్థానిక అవసరాలకు ఇసుక అనుమతులు ఇవ్వాలి

బీర్కూర్, జనవరి 24 (ఆంధ్రజ్యోతి): స్థానిక అవసరాలను దృష్టిలో పెట్టుకుని ఇసుకకు అనుమతి ఇవ్వాలని బీర్కూర్ గ్రామసభలో స్థానిక ప్రజలు అధికారులను కోరారు. శుక్రవారం బీర్కూర్, బీర్కూర్ తండా, రైతునగర్ గ్రామాలలో గ్రామసభలను నిర్వహించారు. ఇందులో భాగంగా బీర్కూర్ గ్రామ పంచాయతీ ఆవరణలో నిర్వహించిన గ్రామసభలో వివిధ అంశాల గురించి స్థానిక ప్రజలు అధికారులతో చర్చించారు. లోకల్ అవసరాల దృష్ట్యా ఇసుకకు అనుమతులు ఇవ్వాలని కోరారు. ఇసుక కొరత వల్ల ఇళ్ళ నిర్మాణాలు ముందుకు సాగడం లేదన్నారు. తమ గ్రామ శివారులోని మంజీరా నదిలో ఇసుక నిల్వలు ఉండగా పక్క గ్రామాల నుంచి ఇసుక తెచ్చుకోవాల్సిన పరిస్థితి దాపురించిందని వారు వాపోయారు.

తాగి వాహనం నడిపిన వారికి రెండు రోజుల జైలుశిక్ష

ఆర్మూర్‌టౌన్, జనవరి24(ఆంధ్రజ్యోతి): మద్యం తాగి వాహనాలు నడిపిన ముగ్గురికి రెండు రోజుల జైలు శిక్షను సెకండ్ క్లాస్ మెజిస్ట్రేట్ గట్టు గంగాధర్ విధించారు. స్థానిక పోలీస్‌స్టేషన్ పరిధిలో గురువారం నిర్వహించిన డ్రంక్ అండ్‌డ్రైవ్‌లో అతిగా మద్యం తాగి వాహనాలు నడిపిన మహేష్, నగేష్, బాలాజీలను పట్టుకొని కేసు నమోదు చేసి సెకండ్ క్లాస్ మెజిస్ట్రేట్ ముందు కోర్టులో హాజరుపర్చగా రెండు రోజుల జైలు శిక్ష విధిస్తున్నట్టు తీర్పు ఇచ్చారు.

కోటగిరి : మద్యం సేవించి వాహనం నడిపిన సుధాకర్ అనే వ్యక్తికి బోధన్ కోర్టు సెకండ్ క్లాస్ మెజిస్ట్రేట్ శేషతల్ప సాయి రెండు రోజులు జైలు శిక్ష విధించినట్లు కోటగిరి ఎస్సై సందీప్ తెలిపారు. ఈ నెల 8వ తేదీన కోటగిరి బస్టాండ్ వద్ద డ్రంక్ అండ్ డ్రైవ్ నిర్వహించగా, రుద్రూర్ మండలానికి చెందిన నీరడి సుధాకర్ మద్యం సేవించి బండి నడుపుతున్నట్లు ఎస్సై సందీప్ తెలిపారు. శుక్రవారం న్యాయస్థానంలో హాజరు పరుచగా మెజిస్ట్రేట్ రెండు రోజుల జైలు శిక్ష విధించినట్లు ఆయన తెలిపారు.

ఎత్తొండ క్యాంపులో ఇసుక ట్రాక్టర్ల పట్టివేత



పోలీస్ స్టేషన్‌కు తరలించిన ఇసుక ట్రాక్టర్లు

కోటగిరి, జనవరి 24 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని ఎత్తొండ క్యాంపులో గురువారం రాత్రి ఇసుకను అక్రమంగా తరలిస్తున్న ట్రాక్టర్‌ను పట్టుకున్నట్లు ఎస్సై సందీప్ తెలిపారు. పొతంగల్ మండలం కారేగాం మంజీర నది నుంచి ఇసుకను అక్రమంగా తరలిస్తుండగా పట్టుకుని పోలీస్‌స్టేషన్‌కు తరలించామని ఎస్సై తెలిపారు. ట్రాక్టర్ యజమానిపై కేసు నమోదు చేశామన్నారు. అనుమతులు లేకుండా ఇసుక అక్రమ రవాణా చేస్తే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

కొనసాగుతున్న బడిబయట పిల్లల సర్వే



కౌన్సెలింగ్ నిర్వహిస్తున్న సీఆర్‌పీ అంజయ్య

కమ్మర్‌పల్లి, జనవరి 24 : పిల్లలు పనుల్లో కాదు బడిలో ఉండాలన్నా సదుద్దేశంతో తెలంగాణ సమగ్ర శిక్ష విద్యాశాఖ ఆదేశాల మేరకు బడి బయట ఉన్న పిల్లల సర్వే కమ్మర్‌పల్లి మం డలంలో కొనసాగుతోంది. శుక్రవారం సీఆర్పీ అంజయ్య ఆధ్వర్యంలో మండలకేంద్రంలోని గొల్లపేట ఇందిరమ్మ కాలనీలో సర్వే నిర్వహించారు. బడికి రాకుండా ఇంటివద్దే ఉంటున్న ఇద్దరు బాలికలకు, వారి తల్లిందడ్రులకు కౌన్సెలింగ్ నిర్వహించారు. పిల్లలను క్రమం తప్పకుండా బడికి పంపాలని సూచించారు. బడీడుపిల్లలు పనుల్లో కాకుండా బడిలో ఉండాలని ఎవరు కూడా ఇతరత్ర పనులకు వెళ్లకుండా బడికి రావాలని సూచించారు. ఆయన వెంట ఉపాధ్యాయడు లక్ష్మీనర్సయ్య ఉన్నారు.

మాజీసర్పంచ్ కుటుంబానికి పరామర్శ

కమ్మర్‌పల్లి, జనవరి 24 (ఆంధ్రజ్యోతి) : ఇటీవల అనారోగ్యంతో మరణించిన హాసాకొత్తూర్ కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకుడు మాజీ సర్పంచ్ వేంపల్లి కిషన్‌గౌడ్ కుటుంబసభ్యులను శుక్రవారం తెలంగాణ రాష్ట్ర ఖనిజాభివృద్ధి కమిటీ చైర్మన్ ఈరవత్రి అనిల్, రాష్ట్ర సహకార యూనియన్ చైర్మన్ జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు మానాల మోహన్ రెడ్డి పరామర్శించి ప్రగాఢ సానుభూతిని తెలిపారు. వారి వెంట మార్కెట్ కమిటీ చైర్మన్ పాలెపు నర్సయ్య, వైస్ చైర్మన్ సుంకెట బుచ్చన్న, మండల కాంగ్రెస్ అధ్యక్షుడు సుంకెట రవి, జిల్లా మైనార్టీ నాయకుడు అబ్దుల్‌రఫీ కాంగ్రెస్ నాయకులు కార్యకర్తలున్నారు.

ఇండోర్ స్టేడియం నిర్మాణానికి రూ.లక్ష ఆర్థికసహాయం

ముప్కాల్, జనవరి 24 (ఆంధ్రజ్యోతి): ముప్కాల్ మండల కేంద్రంలోని స్కాట్ గ్రౌండ్‌లో నిర్వహించిన ఇండోర్ స్టేడియానికి శుక్రవారం నిషిత గ్రూప్ ఇండస్ట్రీయల్ చైర్మన్, బీజేవైఎం రాష్ట్ర ఉపా ధ్యక్షుడు నాయకుడు సంతోష్ తమవంతు రూ.లక్ష ఆర్థిక సహాయాన్ని అందజేశారు. ఈ సందర్భంగా ముప్కాల్ స్పోర్ట్స్ అకాడమీ సభ్యులు జిల్లా కబడ్డీ అసోసియేషన్ వారికి కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో దినేష్, గురు స్వామి, సంజీవ్,, ప్రణయ్, సంజీవ్‌థామస్, వినోద్, తదితరులు పాల్గొన్నారు.

సీనియర్ కబడ్డీ జట్టు ఎంపిక

ముప్కాల్, జనవరి24(ఆంధ్రజ్యోతి): ముప్కాల్ మండల కేంద్రంలో భూదేవ్ ఇండోర్ స్టేడియంలో ఈనెల 28న 71వ సీనియర్ పురుషుల ఇంటర్ డిస్ట్రిక్ కబడ్డీ జట్టును ఎంపిక చేయబడుతుందని జిల్లా కబడ్డీ సంఘం అధ్యక్షుడు అంద్యాల లింగయ్య తెలిపారు. ఈ ఎంపికలో పాల్గొనే క్రీడాకారులు 28న ఉదయం 10గంటలకు ఆధార్‌కార్డుతో రిపోర్టు చేయాలని, ఎంపికైన జిల్లా జట్టు వచ్చే నెల 4నుంచి 7వ తేదీ వరకు ఆదిలాబాద్ జిల్లాలో పాల్గొనున్నారని తెలిపారు.

వాహనదారులు నిబంధనలను పాటించాలి



వాహనాలను తనిఖీ చేస్తున్న పోలీసులు

ముప్కాల్, జనవరి24(ఆంధ్రజ్యోతి): వాహనదారులు నిబంధనలు పాటించాలని ముప్కాల్ హెడ్‌కానిస్టేబుల్ లస్మన్న అన్నారు. శుక్రవారం ముప్కాల్ మండల కేంద్రంలో పాత జాతీయరహదారిపై వాహనదారులకు అవగాహన కల్పించారు. వాహనదారులు తప్పనిసరి హెల్మెట్ ధరించాలని, రోడ్డు ప్రమాదాల నివారించే ఉద్దేశంతో వాహనాలను తనిఖీ చేస్తున్నామన్నారు. మద్యంతాగి, వాహనాలు నడపవద్దని, మైనర్‌లకు వాహనాలు ఇవ్వవద్దని, కార్లు నడిపే వారు సీట్ బెల్ట్ ధరించాలని, నెంబర్ ప్లేట్ వాహనాలను సీజ్ చేస్తామని, పాత చాలన్ ఉంటే చెల్లించాలన్నారు. ట్రాఫిక్ నిబంధనలు అతిక్రమిస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు. ఈ సమావేశంలో కానిస్టేబుల్ నవనీత్, సాయి, రాజేశ్వర్, తదితరులు పాల్గొన్నారు.

మండల రేషన్ డీలర్ల కమిటీ ఎన్నిక

నసురుల్లాబాద్, జనవరి 24 (ఆంధ్రజ్యోతి): నసురుల్లాబాద్ మండల రేషన్ డీలర్ల కమిటీని కామారెడ్డి జిల్లా మాజీ ప్రధాన కార్యదర్శి నాగరాజు ఆధ్వర్యంలో శుక్రవారం ఎన్నుకోవడం జరిగిందని రేషన్ డీలర్లు తెలిపారు. ఈ సందర్భంగా మండల రేషన్ డీలర్ల సంక్షేమ సంఘం అధ్యక్షునిగా అంకోల్ తాండకి చెందిన రేషన్ డీలర్ కేతావత్ కిషన్ నాయకున్ని అధ్యక్షుడిగా, అంకోల్ గ్రామ రేషన్ డీలర్ నరేష్‌ని ప్రధాన కార్యదర్శిగా ఎన్నుకోవడం జరిగిందన్నారు.



గ్రామంలో తిరుగుతున్న కోతులు

గ్రామాల్లో కోతుల స్వైర విహారం

● భయాందోళనలో మోపాల్ ప్రజలు

మోపాల్, జనవరి 24 (ఆంధ్రజ్యోతి): గ్రామీణ ప్రాంతాల్లో కోతుల బెడద ఎక్కువ కావడంతో అక్కడ నివసించే ప్రజలు భయాందోళన చెందుతున్నారు. కోతులు ఒకేసారి 10 నుంచి 20 వరకు ఇళ్లపై దాడులు చేస్తున్నాయని గ్రామ ప్రజలు ఆందోళన చెందుతున్నారు. మండలంలోని ముదక్‌పల్లి గ్రామానికి చెందిన హంసవ్వపై గత రెండు రోజుల క్రితం కోతి దాడి చేసి తీవ్రంగా గాయపర్చింది. గ్రామంలో కోతుల బెడద ఎక్కువగా ఉండటంతో ప్రజలు రోడ్డుపై తిరగాలంటేనే భయాందోళనకు గురవుతు న్నారు. అడవిలో ఉండ వల్సిన కోతులు గ్రామాల్లో తిరుగుతుండటంతో చిన్న పిల్లల నుంచి పెద్దల వరకు తమపై ఎప్పుడు దాడి చేస్తాయోనని భయాందోళనకు గురవుతున్నారు. ఇళ్లపై దాడులు చేసి ఇంట్లో ఉన్న వస్తువులను చిందర వందర చేయడంతో పాటు మనుషులపై దాడి చేసి తీవ్రంగా గాయపరుస్తున్నాయని వారు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. స్థానికంగా ఉన్న ప్రజాప్రతినిధులు ఎవరూ పట్టించుకోవడం లేదని గ్రామస్థులు మండిపడుతున్నారు. గ్రామాల్లో కోతులు స్వైర విహారం పెరిగిపోతున్నా అధికారులు కానీ, ప్రజా ప్రతినిధులు ఎవరూ పట్టించుకోవడం లేదని మండిపడుతున్నారు. ముదక్‌పల్లి గ్రామంలో కోతుల బెడద ఎక్కువ కావడంతో గత కొన్ని సంవత్సరాల క్రితం గ్రామాభివృద్ధి కమిటీ పెద్దలు కోతులు పట్టే వారిని పిలిపించి సుమారు 150 నుంచి 200 కోతులను పట్టి వాటిని అడవిలో వదిలివేశారు. మరి కొన్ని రోజులకు కోతులు గ్రామాల్లోకి తిరిగి వచ్చాయని గ్రామస్థులు వివరించారు. కోతుల బెడద ఎక్కువ కావడంతో చిన్న పిల్లలను బయటకు పంపాలంటేనే భయమవుతుందని గ్రామస్థులు తెలిపారు. చిన్న పిల్లలు కిరాణా షాపుకు వెళ్లి ఏవైనా వస్తువులు కొనుగోలుకు వెళ్తే వారిపై కూడా కోతులు దాడి చేసి తీవ్రంగా గాయపరుస్తున్నాయని గ్రామస్థులు తెలిపారు. ఇప్పటికైనా అధికారులు, ప్రజా ప్రతినిధులు స్పందించి కోతులను అరికట్టేందుకు చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

కోతులు మనుషులపై దాడి చేస్తున్నాయి

● హంసవ్వ, ముదక్‌పల్లి

కోతులు గ్రామాల్లో విపరీతంగా తిరుగుతున్నాయి. మనుషులు కనిపిస్తే వారిపై దాడి చేసి తీవ్రంగా గాయపరుస్తున్నాయి. చిన్న పిల్లలను బయటకు పంపాలంటేనే భయంగా ఉంది. అధికారులు స్పందించి కోతులను నియంత్రించాలి. లేకుంటే రాబోయే రోజుల్లో కోతుల భయానికి ప్రజలు ఎవరూ రోడ్ల మీద తిరగలేరు.


హంసవ్వను గాయపర్చిన కోతి

యంచ గోదావరిలో ఘనంగా తెప్పోత్సవం


యంచ ఓం జగదాద్రి ఆలయంలో పూజలు చేస్తున్న నిజామాబాద్ అర్బన్ ఎమ్మెల్యే ధన్‌పాల్ సూర్యనారాయణ

నవీపేట, జనవరి 24 (ఆంధ్రజ్యోతి): మండలంలోని యంచ గోదావరిలో శుక్రవారం రాత్రి తెప్పోత్సవం ఘనంగా నిర్వహించారు. ఈ నెల 16 నుండి ఫిబ్రవరి 2వరకు మండలంలోని యంచలోని శ్రీ ఓం జగదాద్రి దేవి ఆలయ 6వ వార్షికోత్సవ బ్రహ్మోత్సవాలు కొనసాగుతున్నాయి. ఉత్సవాలలో భాగంగా జగదాద్రి ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. రాత్రి గోదావరి నదిలో జగదాద్రి దేవి తెప్పోత్సవం నిర్వహించారు. ఈ సందర్భంగా నిజామాబాద్ అర్బన్ ఎమ్మెల్యే ధన్‌పాల్ సూర్యనారాయణ ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం జరిగిన తెప్పోత్సవంలో ఆయన పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో శ్రీ ఓం జగదాద్రి ఆలయ వ్యవస్థాపకురాలు స్వర్ణ కమల లక్ష్మి, ఓం పంచశక్తి పీఠాధిపతి శ్రీ ఓం జ్ఞానశక్తి స్వామిజీ, పెద్ద ఎత్తున భక్తులు పాల్గొన్నారు.


నృత్యం చేస్తున్న విద్యార్థినులు

జన్నేపల్లి ఎస్ఎస్ఆర్ పాఠశాలలో ఎస్సెస్సీ విద్యార్థులకు వీడ్కోలు

నవీపేట, జనవరి 24 (ఆంధ్రజ్యోతి): మండలంలోని జన్నేపల్లి ఎస్ఎస్ఆర్ సీనియర్ సెకండరీ పాఠశాలలో శుక్రవారం రాత్రి పదో తరగతి విద్యార్థులకు వీడ్కోలు సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా పాఠశాల విద్యార్థులు నిర్వహించిన సాంస్కృతిక కార్యక్రమాలు అందరిని ఆకట్టుకున్నాయి. ఈ కార్యక్రమంలో ఎస్ఎస్ఆర్ విద్యాసంస్థల చైర్మన్ మారయ్య గౌడ్, సీఈవో హరితా గౌడ్, డైరెక్టర్ హర్షిత్ గౌడ్, ప్రిన్సిపాల్ భాస్కర్, అకాడమిక్ కోఆర్డినేటర్ శ్రావణి ప్రియ, ఉపాధ్యాయ సిబ్బంది పాల్గొన్నారు.



అద్దె భవనాల్లో అంగన్‌వాడీ కేంద్రాలు

● అంబం గ్రామంలో అసంపూర్తిగా అంగన్వాడీ భవన నిర్మాణ పనులు ● అరకొర సౌకర్యాలతో కాలం వెల్లదీస్తున్న చిన్నారులు ● పట్టించుకోని అధికారులు

రుద్రూర్, జనవరి 24 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలో పలు అంగన్‌వాడీ కేంద్రాల నూతన భవన నిర్మాణాలు పడకేశాయి. దీంతో చాలీచాలని అద్దె భవనాల్లో, అరకొర వసతుల మధ్య అంగన్వాడీ కేంద్రాలు కొనసాగుతున్నాయి. సరైన సదుపాయాలు లేకపోవడంతో నిర్వాహకులతో పాటు చిన్నారులు ఇబ్బందులు పడుతున్నారు. మాతా శిశు సంరక్షణలో భాగంగా చిన్నారులు, గర్భిణులు, బాలింతలకు పౌష్టికాహారం అందించడం, ఆరు నెలల నుంచి ఆరేళ్లలోపు వయసు ఉన్న పిల్లలకు ఆట పాటలతో కూడిన విద్య నేర్పించాలన్న లక్ష్యంతో ప్రభుత్వం అంగన్వాడీ కేంద్రాలను ఏర్పాటు చేసింది. కానీ పలు కేంద్రాల్లో సమస్యలు తిష్ట వేశాయి. కనీస సౌకర్యాలు లేని అద్దె భవనాల్లో అంగన్వాడీ కేంద్రాలు కొనసాగుతున్నాయి. రుద్రూర్ మండల కేంద్రంలో మొత్తం 23 అంగన్వాడీ కేంద్రాలు ఉన్నాయి. ఇందులో రుద్రూర్ గ్రామంలో రెండు సెంటర్-4, సెంటర్ - 6 అంగన్వాడీ కేంద్రాలు, అంబం(ఆర్) గ్రామంలో ఒక అంగన్వాడీ కేంద్రానికి సొంత భవనం లేక అద్దె భవనంలోనే కొనసాగిస్తున్నారు. అంబం(ఆర్) గ్రామంలో అంగన్వాడీ భవన నిర్మాణ పనులు అర్థాంతరంగా మధ్యలోనే నిలిచిపోవడంతో, గ్రామంలోని ఆరోగ్య ఉప కేంద్రంలోనే అంగన్వాడీ కేంద్రాన్ని కొనసాగిస్తున్నారు. అద్దె భవనాల్లో నడుస్తున్న కేంద్రాలకు ప్రతి నెల అంగన్వాడీ కార్యకర్తలే అద్దె చెల్లిస్తున్నారు. కనీస సౌకర్యాలు లేని అద్దె ఇళ్లల్లో కొనసాగుతున్న అంగన్వాడీ కేంద్రాల్లో చిన్నారులు, గర్భిణులు నానా ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. చిన్నపాటి అద్దె గదిలోనే సామాగ్రిని భద్రపర్చడం, ఒకపూట వండి పెట్టడం, చిన్నారులకు పూర్వ ప్రాథమిక విద్య అందించడం వంటి పనులన్నీ ఒకేచోటే నిర్వహించాల్సిన దుస్థితి నెలకొంది. మూత్రశాలలు, త్రాగునీటి సరఫరా తదితర సౌకర్యాలు లేని ఇరుకైన అద్దె గదుల్లోని కేంద్రాలకు వెళ్ళేందుకు నిరాసక్తి చూపుతున్నారు. దీంతో అంగన్వాడీ కేంద్రాల్లో హాజరుశాతం పడిపోతుందనే వాదన వినిపిస్తోంది.

పనులను మధ్యలోనే ఆపేశారు

● లక్ష్మీ,అంగన్‌వాడీ టీచర్, అంబం

రుద్రూర్ మండలంలోని అంబం(ఆర్) గ్రామంలో రెండు అంగన్‌వాడీ కేంద్రాలు ఉన్నాయి. మా అంగన్‌వాడీ సెంటర్ - 2 లో 20 మంది చిన్నారులు ఉంటారు. అంగన్‌వాడీ కేంద్రం భవన నిర్మాణ పనులు చేపట్టి పూర్తి చేయకుండా అసంపూర్తిగా పనులను మధ్యలోనే నిలిపివేశారు. ఇప్పటికి రెండు సంవత్సరాలు గడుస్తున్నా అంగన్‌వాడీ భవన నిర్మాణ పనులు ప్రారంభించకుండా అలానే వదిలేశారు. ప్రస్తుతానికి ఆరోగ్య ఉపకేంద్రానికి కేటాయించిన భవనంలోనే అంగన్‌వాడీ కేంద్రాన్ని కొనసాగిస్తున్నాం. ఇక్కడ సరైన సౌకర్యాలు లేక చిన్నారులు, గర్భిణులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఉన్నతాధికారులు వెంటనే స్పందించి అసంపూర్తిగా ఉన్న అంగన్వాడీ భవన నిర్మాణ పనులను పూర్తి చేయాలని కోరుతున్నాం.



రుద్రూర్‌లో అద్దె భవనంలో కొనసాగుతున్న అంగన్‌వాడీ కేంద్రంలో చిన్నారులు

నూతన భవన నిర్మాణం చేపట్టాలి

● పి.సావిత్రి, అంగన్‌వాడీ టీచర్, రుద్రూర్

రుద్రూర్ గ్రామంలో అంగన్‌వాడీ సెంటర్ - 6, ఈ అంగన్‌వాడీ కేంద్రానికి సొంత భవనం లేక అద్దె భవనంలోనే అంగన్వాడీ కేంద్రాన్ని కొనసాగిస్తున్నాం. అంగన్‌వాడీ పాత భవనం శిథిలావస్థకు చేరడంతో కూల్చివేశారు. రెండు సంవత్సరాలు గడుస్తున్నా నూతన భవన నిర్మాణ పనులు ఇప్పటి వరకు ప్రారంభించడం లేదు. అద్దె ఇంట్లో అంగన్‌వాడీ కేంద్రాన్ని నిర్వహిస్తున్నాం. మా సెంటర్‌లో 14 మంది చిన్నారులు ఉంటారు. అద్దె గదికి ప్రతీ నెల అద్దె చెల్లిస్తున్నాం. గది ఇరుకుగా ఉండడంతో పాటు, మూత్రశాలలు, త్రాగు నీరు తదితర సౌకర్యాలు లేకపోవడంతో తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నాం. అలాగే ఈ ఇరుకుగా ఉన్న గదిలో సామాగ్రి పెట్టడానికి కూడా ఇబ్బందికరంగా మారింది. దీంతో చిన్నారులు, గర్భిణులు తీవ్ర అవస్థలు పడుతున్నారు. ఇప్పటికైనా అధికారులు వెంటనే స్పందించి నూతన భవన నిర్మాణ పనులను ప్రారంభించాలని కోరుతున్నాం.

ఇరుకు గదితో ఇబ్బందులు

● సునంద, అంగన్‌వాడీ టీచర్, రుద్రూర్

రుద్రూర్ గ్రామంలో గల అంగన్‌వాడీ సెంటర్ - 4 ను అద్దె ఇంట్లో కొనసాగిస్తున్నాం. మా అంగన్‌వాడీ కేంద్రానికి సొంత భవనం లేకపోవడంతో, ఈ ఇరుకుగా ఉన్న గదిలో సామాగ్రి పెట్టడానికి కూడా ఇబ్బందికరంగా మారింది. మా సెంటర్‌లో 15 మంది చిన్నారులు ఉంటారు. ప్రతీ నెలా అద్దె చెల్లిస్తున్నాం. అదేవిధంగా అద్దె ఇంట్లో కూడా సరైన సౌకర్యాలు లేక గర్భిణులు బాలింతలు, చిన్నారులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. అధికారులు వెంటనే స్పందించి అంగన్‌వాడీ కేంద్రానికి నూతన భవన నిర్మాణం చేపట్టాలని కోరుతున్నాం.

రుద్రూర్‌లో 23 అంగన్వాడీ కేంద్రాలు

● శ్రీలత, అంగన్‌వాడీ సూపర్ వైజర్

రుద్రూర్ మండల కేంద్రంలో మొత్తం 23 అంగన్వాడీ కేంద్రాలు ఉన్నాయి. అందులో రుద్రూర్ గ్రామంలో సెంటర్ - 4, సెంటర్ - 6, అంబం గ్రామంలో సెంటర్ - 2, అంగన్వాడీ కేంద్రాలు అద్దె భవనంలో కొనసాగిస్తున్నాం. రుద్రూర్‌లోని రెండు అంగన్‌వాడీ సెంటర్లకు సొంత భవనాలు మంజూరయ్యాయి. అదేవిధంగా అంబం(ఆర్) గ్రామంలో అసంపూర్తిగా ఉన్న అంగన్వాడీ భవన నిర్మాణ పనులను అధికారుల దృష్టికి తీసుకెళ్లి త్వరలోనే పూర్తి చేయిస్తామని తెలిపారు.


రుద్రూర్ శిథిలావస్థకు చేరిన అంగన్‌వాడీ భవనం


అంబం గ్రామంలో అర్థాంతరంగా నిలిచిపోయిన అంగన్వాడీ భవన నిర్మాణ పనులు

పథకాలు అనర్హులకేనా..

మరి.. మా సంగతేంటి..!?

పెద్దకొడప్‌గల్, జనవరి 24 (ఆంధ్రజ్యోతి): తెలంగాణ ప్రభుత్వం అమలు చేస్తున్న 4 పథకాలు కొందరికే మంజూరయ్యాయి మరి పథకాలు మంజూరు కాని మా పరిస్థితి ఏంటని ప్రజలు అధికారులను నిలదీసిన సంఘటన పెద్ద కొడప్‌గల్ మండల కేంద్రంలో చోటు చేసుకుంది. గ్రామ సభ చివరి రోజు కార్యక్రమంలో భాగంగా పెద్ద కొడప్‌గల్ గ్రామ పంచాయితీ కార్యాలయ ఆవరణలో తహసీల్దార్ దశరథ్ ఆధ్వర్యంలో గ్రామ సభ నిర్వ హించారు. అధికారులు గ్రామ సభలో తమ శాఖలకు సంబంధించిన నివేదికలు చదువుతుండగానే పథకాలు మంజూరు అయిన వారికి సంతృప్తికరంగా ఉన్న పథకాలు వర్తించని తమ సంగతేంటని ప్రజలు అధికారులను నిలదీశారు. ఇందిరమ్మ ఆత్మీయ భరోసా పథకానికి తాము అర్హులమైన తమ పేర్లు రాలేదని నిలదీశారు. దీంతో పాటుగానే రేషన్ కార్డుల కోసం తాము గతంలో చాలా సార్లు దరఖాస్తు చేసుకున్న తమ పేర్లు లిస్ట్‌లో రాలేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. 10 సంవత్సరాల నుంచి రేషన్ కార్డుల కోసం ఎదురుచూస్తున్న తమకు కార్డులు ఇంక మంజూరు కాలేదని వాపోయారు. గతంలో ప్రజాపాలన కార్యక్రమం సందర్భంగా తాము రేషన్ కార్డుల కోసం దరఖాస్తు చేసుకుంటే వాటి ని సిబ్బంది నిర్లక్ష్యంతో ఆన్‌లైన్ చేయలేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఇందిరమ్మ ఆత్మీయ భరోసా పథకంలో అనర్హులకు చోటు కల్పించారని మండి పడ్డారు. ఆందోళన చేస్తున్న వారికి కొంతమంది తోడు కావడంతో పరిస్థితి చేయి దాటేలా కనిపించడంతో పోలీసులు కల్పించుకుని ఆందోళన చేస్తున్న వారిని సము దాయించారు. అనంతరం తహసీల్దార్ దశరథ్ మాట్లాడుతు ప్రజలు 4 పథకాలలో ఏ ఒక్కటి మంజూరు కానున్న తిరిగి దరఖాస్తు చేసుకుంటే పరిశీలించి పథకాలు వర్తించేలా చర్యలు తీసుకుంటామని తెలిపారు. రేషన్ కార్డుల మంజూరు అనేది నిరంతర పక్రియ అని ఎప్పుడు దరఖాస్తు చేసుకున్న పరిశీలించి మంజూరు చేస్తామని తెలిపారు. అనంతరం మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు మహేందర్ రెడ్డి మాట్లాడుతు ప్రజలెవరూ రావడం లేదని ఆందోళన చెందవద్దని ఏ పథకానికి ఎవరూ అర్హులో దరఖాస్తు చేసుకుంటే వారికి ఆ పథకాలు మంజూరు అయ్యేలా కృషి చేస్తానని తెలిపారు. ఈ కార్యక్రమంలో మండల ప్రత్యేక అధికారి కిషన్, ఆర్‌ఐ అంజయ్య, పంచాయితీ అధికారి శ్రీనివాస్, నాయకులు నాగిరెడ్డి, చిప్ప మోహన్, సంజీవ్, పండరి, విఠల్ తదితరులు పాల్గొన్నారు.


ఆందోళన చేస్తున్న వారిని సముదాయిస్తున్న పోలీసులు

పేర్లు లేవని అధికారుల నిలదీత

● గోపాల్‌పేట్ గ్రామసభలో ప్రజల ఆగ్రహం ● అనర్హుల పేర్లు ఉన్నాయంటూ అభ్యంతరాలు


గోపాల్‌పేట్ గ్రామ సభలో అధికారులను ప్రశ్నిస్తున్న దృశ్యం

నాగిరెడ్డిపేట, జనవరి 24 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలోని గోపాల్ పేట్ గ్రామ పంచాయతీలో శుక్రవారం జరిగిన ప్రజా పాలన గ్రామ సభలో ప్రజలు అధికారుల తీరుపై ఆగ్రహం వ్యక్తం చేశారు. అధికారులు ఇందిరమ్మ ఇళ్ల, రేషన్ కార్డుల జాబితా పేర్లను గ్రామ సభలో చదువగా, ఇందిరమ్మ ఇళ్ల జాబితాలో, రేషన్ కార్డుల జాబితాలో తమ పేర్లు రాలేవని, అనర్హుల పేర్లు వచ్చాయని ఆరోపిస్తూ మహిళలు, ప్రజలు తమ నిరసనలు వ్యక్తం చేస్తూ గ్రామసభలో అధికారు లను నిలదీశారు. దీంతో గ్రామ సభలో చాలాసేపు గందరగోల పరిస్థితి నెలకొంది. ఇందిరమ్మ ఇళ్ల మంజూరి కోసం తాము దరఖాస్తులు చేసుకుని ఎదురు చూస్తుండగా, సొంత ఇళ్లు లేని అర్హులైన తమకు జాబితాలో పేర్లు రాకుండా, జాబితాలో అనర్హుల పేర్లు ఎలా వచ్చాయని అధికారులను నిల దీశారు. అధికారులు, పోలీసులు ప్రజలకు నచ్చ జెప్పే ప్రయత్నం చేసిన ఫలితం లేకపోయింది. జాబితాలో నుంచి అనరుల పేర్లను వెంటనే తొలగించాలని వారు డిమాండ్ చేశారు. విచారణ జరిపి అనర్హుల పేర్లను తొలగిస్తామని, జాబితాలో పేర్లు రానివారు తిరిగి గ్రామసభలో దరఖాస్తులు చేసుకోవాలని స్థానిక ఎంపీడీవో ప్రభాకర్‌చారి ప్రజలకు నచ్చజెప్పడంతో ఎట్టకేలకు ప్రజలు శాంతించడంతో గ్రామ సభను కొనసాగించారు. అనంతరం ప్రజలు ఇందిరమ్మ ఇళ్ల కోసం, రేషన్ కార్డుల కోసం తిరిగి దరఖాస్తులు చేసుకున్నారు. శుక్రవారం గోపాల్ పేట్ గ్రామపంచాయతీతో పాటు, మండలం లోని జలాల్‌పూర్, చిన్న ఆత్మకూర్, మాసానిపల్లి, బొల్లారం, జప్తి జనకంపల్లి, గోలి లింగాల్, మెల్ల కుంట తండా, కన్నా రెడ్డి గ్రామపంచాయతీలో గ్రామ సభలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో మండల ప్రత్యేక అధికారిణి రత్నం ఎంపీడీవో ప్రభాకర్ చారి, ఐకేపీ ఏపీఎం జగదీష్ కుమార్, ఆర్‌ఐ మహ్మద్, పంచాయతీ కార్యదర్శులు, నాయకులు, ప్రజలు పాల్గొన్నారు.

101 అడుగుల ఎత్తులో ఎగరనున్న జాతీయ జెండా

● బోధన్ పట్టణ నడిబొడ్డున ముమ్మర ఏర్పాట్లు ● నిత్యం రెపరెపలాడనున్న జెండా ● రేపు ఆవిష్కరించనున్న ఎమ్మెల్యే సుదర్శన్‌రెడ్డి


బోధన్ పట్టణంలోని అంబేద్కర్ చౌరస్తాలో 101 అడుగుల ఎత్తులో ఏర్పాటు చేసిన జాతీయ జెండా


ఏర్పాట్లను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే సుదర్శన్‌రెడ్డి(ఫైల్)


బోధన్‌రూరల్, జనవరి 24 (ఆంధ్రజ్యోతి): బోధన్ పట్టణంలోని అంబేద్కర్ చౌరస్తాలో 101 అడుగుల ఎత్తులో జాతీయ జెండా ఆవిష్కరణ సందర్భంగా ముమ్మర ఏర్పాట్లు చేస్తున్నారు. గణతంత్ర దినోత్సవం సందర్భంగా బోధన్ ఎమ్మెల్యే సుదర్శన్ రెడ్డి 10 అడుగుల ఎత్తులో ఉన్న జాతీయ జెండాను ఆవిష్కరించనున్నారు. బోధన్ పట్టణంలోని అంబేద్కర్ చౌరస్తా నడిబొడ్డున నిత్యం జాతీయ జెండా రెపరెపలాడనుంది. ఏకచక్ర సేవా సమితి అకుంఠిత దీక్షతో 101 అడుగుల ఎత్తులో జాతీయ జెండాను ఆవిష్కరించాలనే పట్టుదలతో సంకల్పించింది. సుమారు నెల రోజుల క్రితం ప్రారంభమైన పనులు గణతంత్ర దినోత్సవం సందర్భంగా పూర్తయ్యాయి. గణతంత్ర దినోత్సవం సందర్భంగా బోధన్‌లో ఎంతోమంది ప్రజల కల నెరవేరనుంది. నిత్యం అంబేద్కర్ చౌరస్తాలో జాతీయ జెండా రెపరెపలాడనుంది. ఏకచక్ర సేవా సమితి ఆధ్వర్యంలో 101 అడుగుల జాతీయ జెండా పనులను ప్రారంభించారు. యువత దేశభక్తిని అలవర్చుకోవాలని, దేశం కోసం, ధర్మం కోసం కృషి చేయాలన్న ఉద్దేశంతో బోధన్‌లోని ఏకచక్ర సేవా సమితి బృందం పట్టణం నడిబొడ్డున అంబేద్కర్ చౌరస్తాలో 101అడుగుల జాతీయ జెండాను ఏర్పాటు చేశారు. అనుకున్న ప్రకారం గణతంత్ర దినోత్సవానికి ముందు పనులు పూర్తి చేసేలా కృషి చేస్తున్నారు. ఈ పనులను పట్టణ ప్రముఖులు, ఏకచక్ర సేవా సమితి బృందం నిత్యం పర్యవేక్షిస్తున్నారు. అందరి సహకారంతో 101 అడుగుల జాతీయ జెండా కల సాకారం అవుతుందని నిర్వాహకులు పేర్కొంటున్నారు. బోధన్‌లో 101 అడుగుల జాతీయ జెండా తెలంగాణలోనే ప్రాముఖ్యతను సంతరించుకోనుంది.

● 2019 సంవత్సరంలో ఏకచక్ర సేవా సమితి ప్రారంభం

బోధన్‌లో ఏకచక్ర సేవా సమితి 2019సంవత్సరంలో ప్రారంభమైంది. అనేక సేవా కార్యక్రమాలను నిర్వహించింది. ప్రపంచాన్ని అతలాకుతలం చేసిన కరోనా మహమ్మారి సమయంలో ఉచిత వైద్య శిబిరాలను, కరోనా బారిన పడిని వారికి వలస కూలీలకు భోజన సదుపాయలను ఏర్పాటు చేసి వారి వారి స్వస్థలాలకు పంపించడం జరిగింది. 2022 సంవత్సరంలో మీల్స్ అండ్ వీల్స్ అనే పేరుతో పేదలకు 10 రూపాయలకే భోజనాన్ని అందజేసి సేవా దృక్పదాన్ని చాటింది. యోగా దినోత్సవం, రక్తదానం, పేదలకు దుప్పట్ల పంపిణీ, స్వచ్ఛ భారత్ వంటి అనేక కార్యక్రమాలు నిర్వహించి సామాజిక సేవను తామే కాకుండా సమాజానికి అలవాటు చేసింది. ప్రస్తుతం ప్రథమంగా మన తెలంగాణ రాష్ట్రంలోనే 101 అడుగుల ఎత్తులో గల జాతీయ జెండాను బోధన్ పట్టణంలోని అంబేద్కర్ చౌరస్తా వద్ద ఏర్పాటు చేయడానికి తనవంతు బాధ్యతగా ప్రతీఒక్కరు నిర్మాణంలో సహాయం అందించి దేశభక్తిని చాటుకుని భాగస్వాములు అయ్యారు.

అందరి సహకారంతో చిరకాల వాంఛ నెరవేరింది

● అంకు మహేష్, ఏకచక్ర సేవా సమితి అధ్యక్షుడు



బోధన్ పట్టణంలో ఏకచక్ర సేవా సమితి ఆధ్వర్యంలో చేపట్టిన 101 అడుగుల జాతీయ జెండా అందరి సహకారంతో ప్రజలు అనుకున్న కల సాకారం అయింది. అందరి సహకారం, అందరి కృషి వల్లనే 101అడుగుల ఎత్తులో జాతీయ జెండా పనులు పూర్తి అయ్యాయన్నారు. 101అడుగుల జాతీయ జెండా నిర్మాణంలో ప్రతి ఒక్కరు చేయి చేయి కలపాలరని, జైహింద్ అని నినాదించి దేశభక్తిని చాటుకున్నారన్నారు.

స్కిల్ డెవలప్‌మెంట్‌లో శిక్షణకు కసరత్తు

● జిల్లాలో ఐటీఐ, పాలిటెక్నిక్ చదివే విద్యార్థులకు స్కిల్ డెవలప్‌మెంట్‌లో శిక్షణ ఇచ్చేందుకు పైలెట్ ప్రాజెక్టు

● ఫిబ్రవరి లేదా మార్చిలో ప్రారంభించేందుకు ఏర్పాట్లు ● విద్యార్థులకు ఉపాధి కల్పించేందుకే శిక్షణ : ఎమ్మెల్యే సుదర్శన్‌రెడ్డి

నిజామాబాద్, జనవరి 24 (ఆంధ్రజ్యోతి ప్రతినిధి): జిల్లాలోని ఐటీఐ, పాలిటెక్నిక్ విద్యార్థులకు స్కిల్ డెవలప్‌మెంట్‌లో శిక్షణ ఇచ్చి ఉపాధి కల్పించేందుకు సిద్ధమవుతున్నారు. హైదరాబాద్‌కు చెందిన వివిధ కంపెనీల ఆధ్వర్యంలో శిక్షణ అందించనున్నారు. కోర్సు పూర్తికాగానే ఉద్యోగాల్లో చేరే విధంగా వారికి తర్ఫీదును అందిస్తారు. ఐటీఐ ఫైనల్‌ఇయర్, పాలిటెక్నిక్ విద్యార్థుల్లో నాల్గవ సెమిస్టర్ నుంచి వారికి తరగతులు లేని సమయంలో శిక్షణ ఇచ్చే విధంగా దానిని రూపొందిస్తున్నారు. ప్రభుత్వ నిధులతో పాటు కార్పొరేట్ కంపెనీల సహకా రంతో ఈ శిక్షణను అందించే విధంగా డిజైన్ చేస్తున్నారు. బోధన్ ఎమ్మెల్యే సుదర్శన్‌రెడ్డి ఆధ్వర్యంలో వివిధ సంస్థలతో చర్చలు జరుపుతూ ఈ పైలెట్ ప్రాజెక్టును వచ్చే నెల నుంచి ఈ సాంకేతిక కళాశాలలో అమలు చేసే విధంగా ప్రయత్నాలను చేస్తున్నారు.

వేలల్లో ఐటీఐ, పాలిటెక్నిక్ విద్యార్థులు

జిల్లాలో ఐటీఐ, పాలిటెక్నిక్ చదువుతున్న విద్యార్థులు వేలల్లో ఉన్నారు. పదవ తరగతి తర్వాత ఉపాధి కోసం ఈ కోర్సుల్లో విద్యార్థులు చేరుతున్నారు. ప్రతీ సంవత్సరం వేల మంది ఈ కోర్సుల ద్వారా ఉత్తీర్ణులై బయటకు వస్తున్న చాలా తక్కువ మందికి మాత్రమే ఉపాధి లభిస్తోంది. జిల్లాలో ప్రభుత్వ, ప్రైవేటు ఐటీఐలు 14 వరకు ఉన్నాయి. ఇవే కాకుండా ప్రభుత్వ పాలిటెక్నిక్‌లు 5 ఉండగా, ప్రైవేటులో 3 ఉన్నాయి. ఐటీఐలో ఎలక్ట్రీషియన్, ఫిట్టర్, డ్రాఫ్ట్‌మెన్ సివిల్, వెల్డర్, డీజిల్ మెకానిక్, మెకానాట్రిక్స్‌తో పాటు కొత్తగా మరికొన్ని కోర్సులను ఏర్పాటు చేశారు. పాలిటెక్నిక్‌లో సివిల్, ఎలక్ట్రికల్, ఎలక్ట్రానిక్స్, మెకానికల్, కంప్యూటర్ సైన్స్, ఇన్‌స్ట్రుమెంటే షన్, థెరామిక్స్, మైనింగ్‌తో పాటు ఇతర కోర్సులు ఉన్నాయి. డిప్లొమా ఫార్మసీ కోర్సులు కూడా కొనసాగుతున్నాయి.

నగరం పరిధిలో..

నగరం పరిధిలోని కాకతీయ మహిళా ఇంజనీరింగ్ కళాశాలలో చదువుతున్న ఇంజనీరింగ్ విద్యార్థులకు ఇలాంటి శిక్షణనే గత కొన్నేళ్లుగా అందిస్తున్నారు. విద్యార్థులకు ఇంజనీరింగ్ కోర్సుతో పాటు తరగతులు లేని సమయంలో నెల నుంచి రెండు నెలలు మూడో సంవత్సరం చదువుతున్న విద్యార్థులకు ఈ శిక్షణను అందిస్తున్నారు. నాల్గవ సంవత్సరంలో కూడా ఈ శిక్షణ ఇవ్వడం వల్ల ఆయా కోర్సుల్లో చదువుతున్న విద్యార్థులకు చదువు పూర్తయిన తర్వాత క్యాంపస్ ప్లేస్‌మెంట్‌లో కొంత మందికి ఉపాధి వస్తుంది. ఈ విధంగానే పాలిటెక్నిక్, ఐటీఐలో చదువుతున్న విద్యార్థులకు శిక్షణను అందించేందుకు ఈ పైలెట్ ప్రాజెక్టును చేపట్టేందుకు నిర్ణయించారు. బోధన్ ఎమ్మెల్యే, మాజీ మంత్రి సుదర్శన్‌రెడ్డి ఈవిషయంపై రాష్ట్ర సాంకేతిక విద్య ఉన్నతాధికారులతో పలు దఫాలు చర్చించారు. కాకతీయ కళాశాల ఛైర్మన్ రజినీకాంత్, అధికారులతో చర్చించి నిర్ణయం తీసుకున్నారు. జిల్లా కలెక్టర్‌తో పూర్తిస్థాయిలో చర్చించడంతో పాటు ఐటీఐ, పాలిటెక్నిక్ కళాశాలలో అమలు చేసేందుకు సిద్ధమవుతున్నారు.

ఉపాధి కల్పించేందుకే శిక్షణ..

: ఎమ్మెల్యే సుదర్శన్‌రెడ్డి

జిల్లాలో ఐటీఐ, పాలిటెక్నిక్ చదివే విద్యార్థులకు ఉపాధి కల్పించేందుకు ఈ పైలెట్ ప్రాజెక్టును చేపడుతున్నాం. ఎక్కువగా పేద విద్యార్థులు ఈ కోర్సుల్లో చేరుతున్నారు. ఇప్పటికే రాష్ట్రస్థాయిలో సాంకేతిక విద్యాశాఖ అధికారులతో పాటు పలు కంపెనీల వారితో చర్చించాం. జిల్లాస్థాయిలో కూడా కలెక్టర్, ఇతర అధికారులతో చర్చించాం. ఫిబ్రవరి లేదా మార్చి నెల నుంచి దీన్ని ప్రారంభించే విధంగా వివిధ సంస్థలతో ఒప్పందాలను చేసుకుంటున్నాం. యువతకు ఉపాధి కల్పించడమే లక్ష్యంగా దీనికి రూపకల్పన చేస్తున్నాం.



మహాజన సభలో పాల్గొన్న డీసీసీబీ చైర్మన్

సహకార బ్యాంకు పరిధిలో రూ.2వేల కోట్ల లావాదేవీలు

● డీసీసీబీ ఛైర్మన్ కుంట రమేష్‌రెడ్డి

నిజామాబాద్ అర్బన్, జనవరి 24 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో సహకార బ్యాంకు ఆర్థిక కార్యకలాపాలు రూ.2వేల కోట్లు చేరుకున్నాయని డీసీసీబీ ఛైర్మన్ కుంట రమేష్‌రెడ్డి తెలిపారు. బ్యాంకు ఆవరణలో శుక్రవారం 103వ ఆర్థిక, అర్ధవార్షిక మహాజనసభను నిర్వహించారు. బ్యాంకు పరిధిలోని శాఖల్లో లావాదేవీలు ఎక్కువగా జరిగే విధంగా చర్యలు తీసుకున్నామని తెలిపారు. రైతులకు మేలు చేసేందుకు బ్యాంకు పరిధిలో ప్రస్తుతం ఉన్న లక్షా 50వేల రూపాయల రుణ పరిమితిని 2లక్షలకు పెంచామన్నారు. రైతులందరికి పంట రుణాలను అందించేందుకు ఈ నిర్ణయం తీసుకున్నామన్నారు. పంట రుణాలపై నాబార్డు వడ్డీని 8 శాతానికి వర్తింపజేయాలని కోరగా గతంలో ఉన్న 7 శాతంనే కొనసాగించాలని నిర్ణయం తీసుకున్నామని ఆయన తెలిపారు. బ్యాంకు యొక్క ఎన్‌పీఏ ఆస్తులు 220 కోట్ల నుంచి 120 కోట్లకు తగ్గిందన్నారు. ఎన్‌పీఏను 14 శాతం నుండి 10 శాతానికి తగ్గించామన్నారు. సహకార సంఘాల ద్వారా రైతులందరికి రుణ సదుపాయం కల్పిస్తామని ఆయన తెలిపారు. రైతుల కోసమే అన్ని రకాల పథకాలను వర్తింపజేసే విధంగా బ్యాంకు పరిధిలో నిర్ణయం తీసుకున్నామని ఆయన తెలిపారు. ఈ సమావేశంలో బ్యాంకు వైస్‌ఛైర్మన్ నల్ల చంద్రశేఖర్‌రెడ్డి, మార్క్‌ఫెడ్ అధ్యక్షుడు మారగంగారెడ్డి, డీసీఎంఎస్ ఛైర్మన్ తారాచంద్ నాయక్‌తో పాటు సీఈవో నాగభూషణం, సంఘాల అధ్యక్షులు పాల్గొన్నారు.

నగర అభివృద్ధేలక్ష్యంగా ఐదేళ్ల పాలన

● కాంగ్రెస్ ప్రభుత్వంలో సర్వేలే ఎక్కువయ్యాయి

● నగర మేయర్ దండు నీతూకిరణ్



మాట్లాడుతున్న మేయర్ నీతూకిరణ్

సుభాష్‌నగర్, జనవరి 24 (ఆంధ్రజ్యోతి): నగర అభివృద్ధియే లక్ష్యంగా ఐదేళ్ల పాలన కొనసాగిందని నగర మేయర్ దండు నీతూకిరణ్ అన్నారు. జిల్లా కేంద్రంలోని నగర పాలక సంస్థ కార్యాలయంలో శుక్రవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ.. కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పాటైన తర్వాత ఆరుసార్లు సర్వే నిర్వహించారని అన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వంలో సర్వేలే ఎక్కువయ్యాయని విమర్శించారు. ప్రజల్లో కాంగ్రెస్ ప్రభుత్వంపై నమ్మకం పోయిందని ఇందిరమ్మ కమిటీలలో కాంగ్రెస్ వారే ఉన్నారని అన్నారు. వార్డు సభల్లో కాంగ్రెస్ వాళ్లకే ప్రభుత్వ పథకాలు ఇస్తామని మాట్లాడుతున్నారని అన్నారు. గత ఐదేళ్ల కాలంలో నిజామాబాద్ నగరం అభివృద్ధి చెందిందన్నారు. ఈ కార్యక్రమంలో కార్పొరేటర్లు పాల్గొన్నారు.

ట్రెక్కింగ్ క్యాంప్‌లో గిరిరాజ్ విద్యార్థులు



విద్యార్థులను అభినందిస్తున్న కళాశాల ప్రిన్సిపాల్ రామ్మోహన్‌రెడ్డి

నిజామాబాద్ అర్బన్, జనవరి 24 (ఆంధ్రజ్యోతి): ఈనెల 16 నుంచి 23 వరకు ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలోని గుంటూరు జిల్లా కొండవీడులో జరిగిన ట్రెక్కింగ్ క్యాంప్‌లో నగరంలోని గిరిరాజ్ కళాశాలకు చెందిన విద్యార్థులు పాల్గొన్నారు. కళాశాలకు చెందిన విద్యార్థులు పూజ, ఐశ్వర్య, నందినిలు ట్రెక్కింగ్ క్యాంప్‌లో పాల్గొని విజయవంతంగా పూర్తి చేసుకొని కళాశాలకు వచ్చిన సందర్భంగా వారిని శుక్రవారం ప్రిన్సిపాల్ రామ్మోహన్‌రెడ్డి తదితరులు అభినందించారు.

పెండింగ్ స్కాలర్‌షిప్‌లు విడుదల చేయాలి

నిజామాబాద్ అర్బన్, జనవరి 24 (ఆంధ్రజ్యోతి): పెండింగ్‌లో ఉన్న ఫీజు రీయంబర్స్‌మెంట్, స్కాలర్‌షిప్‌లను వెంటనే విడుదల చేయాలని డిమాండ్ చేస్తూ బీసీ విద్యార్థి సంఘం ఆధ్వర్యంలో ఈనెల 30న హైదరాబాద్‌లోని ఇందిరాపార్క్ వద్ద నిర్వహించే బీసీ విద్యార్థుల సమర శంఖారావం పోస్టర్లను బీసీ సంక్షేమ సంఘం నాయకులు అంజనేయులు, విద్యార్థి సంఘం నాయకులు శుక్రవారం ఆవిష్కరించారు. నగరంలోని కేర్ డిగ్రీ కళాశాలలో నిర్వహించిన కార్యక్రమంలో పోస్టర్లతో పాటు కరపత్రాలను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా బుస్స ఆంజనేయులు మాట్లాడుతూ ప్రభుత్వం వెంటనే గత నాలుగేళ్లుగా పెండింగ్‌లో ఉన్న సుమారు రూ.4,500 కోట్ల బకాయిలను వెంటనే విడుదల చేయాలన్నారు. ఎస్సీ, ఎస్టీ, మైనార్టీ విద్యార్థులకు ఏ విధంగా స్కాలర్‌షిప్ వస్తుందో బీసీ విద్యార్థులకు కూడా అదేవిధంగా ర్యాంకుతో సంబంధం లేకుండా ఇవ్వాలన్నారు. ఈ కార్యక్రమంలో బీసీ విద్యార్థి సంఘం జిల్లా అధ్యక్షుడు సంతోష్, శేఖర్, ఆకుల ప్రసాద్, దేవేందర్, శ్రీలత, శంకర్, తదితరులు పాల్గొన్నారు.



ట్రాఫిక్ రూల్స్ పాటించాలని ప్రతిజ్ఞ చేస్తున్న దృశ్యం

ట్రాఫిక్ రూల్స్‌ను పాటించాలి

● డీటీవో ఉమామహేశ్వర్‌రావు

ఖిల్లా, జనవరి 24 (ఆంధ్రజ్యోతి): ఆటో నడిపే డ్రైవర్లతో పాటు ప్రతి ఒక్కరూ ట్రాఫిక్ రూల్స్ పాటించాలని డీటీవో ఉమామహేశ్వర్‌రావు అన్నారు. రోడ్ సేఫ్టీ అవగాహన కార్యక్రమంలో భాగంగా శుక్రవారం నగరంలోని ఆర్‌టీఏ కార్యాలయం నుంచి ఆటో ర్యాలీని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆటోవాలాలు ప్యాసింజర్లతో పాటు వస్తువులను ట్రాన్స్‌పోర్ట్ చేసే ప్రతీ ఒక్క డ్రైవర్లు రూల్స్‌ను పాటించాలన్నారు. రూల్స్‌ను అతిక్రమిస్తే కేసులు తప్పవని ఆయన హెచ్చరించారు. అంతకు ముందు ట్రాఫిక్ రూల్స్ పాటించాలని ప్రతిజ్ఞ చేశారు. ఈ కార్యక్రమంలో మోటార్ వెహికిల్ ఇన్స్‌పెక్టర్లు కిరణ్‌కుమార్, రాహుల్‌కుమార్, 5వ టౌన్ ఎస్సై గంగాధర్, లక్ష్మయ్య, తదితరులు పాల్గొన్నారు.

సీఎంఆర్‌ఎఫ్ చెక్కుల పంపిణీ

డిచ్‌పల్లి, జనవరి 24 (ఆంధ్రజ్యోతి): మండలంలోని ఘన్‌పూర్ కి చెందిన లబ్ధిదారులకు సీఎంఆర్‌ఎఫ్ చెక్కులను శుక్రవారం కాంగ్రెస్ నాయకులు పంపిణీ చేశారు. రూరల్ ఎమ్మెల్యే భూపతిరెడ్డి సూచనల మేరకు చెక్కులను పంపిణీ చేసినట్లు కాంగ్రెస్ సీనియర్ నాయకులు డా.షాదుల్ల తెలిపారు. ఈ కార్యక్రమంలో తాజా మాజీ ఎంపీటీసీ సవిత రామకృష్ణ, డైరెక్టర్ సతీశ్, నాయకులు లింబాద్రి, హరీశ్, భూపతి, శంకర్ గౌడ్, సాగర్, పాల్గొన్నారు.

క్రీడల్లో ఓడిన వారు కుంగిపోవద్దు

ఇందల్వాయి, జనవరి 24 (ఆంధ్రజ్యోతి): క్రీడల్లో ఓడిన వారు కుంగిపోకుండా గెలుపుకోసం కృషిచేయాలని న్యూ స్టార్ యూత్ సభ్యులు పేర్కొన్నారు. మండలంలోని నల్లవెల్లి గ్రామంలో ఎడ్ల తిరుపతి స్మారక క్రికెట్ టోర్నమెంట్‌ను న్యూ స్టార్ యూత్ ఆధ్వర్యంలో రెండు రోజుల పాటు నిర్వహించారు. మొదటి బహుమతి ఎస్సెస్సీ 2007-08 బ్యాచ్ విద్యార్థులు, రెండో బహుమతి ఎస్సెస్సీ 2008-09 బ్యాచ్ విద్యార్థులు గెలుపొందారు. ఈ కార్యక్రమంలో ఎడ్ల శ్రీనివాస్, అగ్గు మహేస్, రాజన్న, లక్ష్మారెడ్డి, ఎడ్ల మోహన్, ఎడ్ల సాయిలు, నాగభూషణం, కన్నె చిన్ని, న్యూ స్టార్ యూత్ సభ్యులు, క్రీడాకారులు పాల్గొన్నారు.

నిరంతరంగా సంక్షేమ పథకాల ప్రక్రియ

డిచ్‌పల్లి, జనవరి 24 (ఆంధ్రజ్యోతి): అర్హులందరికీ సంక్షేమ పథకాలు అందించేందుకు గ్రామ సభలను ప్రభుత్వం పారదర్శకంగా నిర్వహిస్తుందని బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు పొలసాని శ్రీనివాస్ అన్నారు. శుక్రవారం మండలంలోని కమలపూర్‌లో నిర్వహించిన గ్రామ సభలో ఆయన మాట్లాడారు. అర్హులైన ప్రతి ఒక్కరికీ ప్రభుత్వం సంక్షేమ పథకాలు అందిస్తుందని, ఇది నిరంతర ప్రక్రియ అని ఆయన అన్నారు.

సైబర్ నేరాలకు పాల్పడుతున్న ఇద్దరి అరెస్టు

ఖిల్లా, జనవరి 24 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో సైబర్ నేరాలకు పాల్పడుతున్న ఇద్దరిని నాల్గో టౌన్ పోలీసులు పట్టుకుని వారి వద్ద నుంచి 35 మ్యూల్ ఖాతాలు, ఒక బ్యాంక్ పాస్‌బుక్, 2సెల్‌ఫోన్లు స్వాధీనం చేసుకున్నట్లు నిజామాబాద్ ఏసీపీ రాజవెంకట్‌రెడ్డి ఒక ప్రకటనలో వివరాలు వెల్లడించారు. టెలిగ్రామ్ యాప్ ద్వారా 335 బ్యాంకు ఖాతాలు లూటీకి గురయ్యాయని, రాజస్థాన్ కేంద్రంగా కొనసాగుతున్న సైబర్ క్రైమ్‌లో నిజామాబాద్‌కు చెందిన 35మంది బ్యాంకు ఖాతాల నుంచి రూ.50లక్షల వరకు లూటీ చేసినట్లు ఏసీపీ తెలిపారు. ఖాతా నుంచి తన ప్రమేయం లేకుండానే రూ.1,04,999 డబ్బులు డ్రా అయిన విషయాన్ని బాధితుడు బసకొండ నరేష్ ఈనెల 9న నాల్గవ టౌన్ పోలీసులకు ఫిర్యాదు చేశాడని, ఈ మేరకు కేసు నమోదు చేసుకున్న నగర ఇన్స్‌పెక్టర్ శ్రీనివాస్‌రాజ్ నేతృత్వంలో ఎస్ఐ శ్రీకాంత్‌లు ఆ దిశగా దృష్టి సారించారన్నారు. బ్యాంకు ఖాతా నుంచి డెబిట్ అయిన డబ్బులు మహ్మద్ అబ్దుల్ జవాద్ బ్యాంకు ఖాతాకు వెళ్లినట్లు గుర్తించారన్నారు. సాంకేతిక ఆధారాలను ఉపయోగించి నిందితులు మహ్మద్ అబ్దుల్ జవాద్, గుడుముల సతీక్‌లను అదుపులోకి తీసుకున్నారన్నారు. వీరిని విచారించగా ఈ ర్యాకెట్‌లో రాజస్థాన్‌కు చెందిన ప్రధాన వ్యక్తులు ఏజెంట్లుగా ఏర్పడి తక్కువ సమయంలో ఎక్కువ డబ్బులు సంపాదించాలనే ఆలోచనతో పోలీసు కమిషనరేట్ పరిధిలోని నిజామాబాద్, బోధన్ చుట్టుపక్కల ప్రాంతా ప్రజలతో కలిసి వారితో వివిధ బ్యాంకుల్లో బ్యాంకు ఖాతాలు తెరవడం జరిగిందన్నారు. ఈ ఖాతా నంబర్ ఏటీఎం కార్డు, సంతకాలు చేసిన చెక్‌బుక్‌లను ఏజెంట్లు డీటీడీసీ కొరియర్ ద్వారా రాజస్థాన్‌లో ఉండి సైబర్ నేరాలు చేసే ప్రధాన వ్యక్తులకు పంపేవారన్నారు. సైబర్ నేరగాళ్లు సంపాదించిన డబ్బుల నుంచి ఏజెంట్లకు ప్రతినెలా రూ.15000 అందించేవారన్నారు. ఈ కేసులో భాగంగా 35మ్యూల్ ఖాతాలను గుర్తించడం జరిగిందన్నారు. ఇవి 35ఖాతాలపై దేశవ్యాప్తంగా సుమారు 40ఫిర్యాదులు నమోదయినట్లు చెప్పారు. అంతేకాకుండా ఇంకా ఎవరైతే ఖాతాలను ఓపెన్ చేసి వాటిని పై వ్యక్తులకు ఇచ్చి దాని ద్వారా సైబర్ నేరాలను ప్రోత్సహించిన వారిపై విచారణ జరిపి కఠినమైన చర్యలు తీసుకుంటామన్నారు. అదే విధంగా బ్యాంకు అధికారుల పాత్రపై కూడా అనుమానాలు ఉన్నట్లుగా భావించి ఆ దిశగా విచారణ చేపట్టడం జరుగుతుందన్నారు. ఈ కేసును చాకచక్యంగా వ్యవహరించి నిందితులను పట్టుకోవడంలో నగర ఇన్స్‌పెక్టర్ శ్రీనివాస్‌రాజు, ఎస్ఐ. శ్రీకాంత్, సిబ్బందిని ఏసీపీ అభినందించారు.

'స్పోర్ట్స్ డైరెక్టర్, పీఈటీలను తొలగించాలి'

డిచ్‌పల్లి, జనవరి 24 (ఆంధ్రజ్యోతి): డబ్బులను అక్రమంగా దోచుకుంటున్న టీయూ స్పోర్ట్స్ డైరెక్టర్ బాలకిషన్, పీఈటీ నేతాలను విధుల నుంచి తొలగించాలని పీడీఎస్‌యూ జిల్లా ప్రధాన కార్యదర్శి రాజేశ్వర్ డిమాండ్ చేశారు. శుక్రవారం వీరిద్దరిపై వైస్ చాన్సలర్ ప్రొ.యాదగిరిరావుకు పీడీఎస్‌యూ నాయకులు వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. తమిళనాడులో గత డిసెంబరులో పురుషులకు ఖోఖో పోటీలు జరిగాయన్నారు. అయితే తెలంగాణ వర్సిటీ నుంచి 12మంది వెళ్లారని దీని కోసం వర్సిటీ అధికారులు రూ.76,800 క్రీడాకారులకు స్పోర్ట్స్ అధికారులు ట్రావెలింగ్, భోజన ఖర్చులకు రూ.45వేలు మాత్రమే ఇచ్చారని తెలిపారు. క్రీడాకారులకు ముందుగా, లేదా వచ్చిన తర్వాత గేమ్ టిక్‌టక్ షట్ ఇవ్వాలని, కానీ నెల రోజుల ముందు ఇచ్చిన డబ్బులు ఖర్చు చేయకుండా క్లయిమ్ చేసిన రూ.36,800 చేశారని ఆయన ప్రశ్నించారు. వర్సిటీలో సెలక్షన్ జరిగినప్పుడు పీఈటీలు అక్రమాలకు పాల్పడుతున్నారని అన్నారు. నిర్వహనకు రూ.2వేల కూడా ఖర్చు కావడం లేదని ఇప్పటి వరకు చెల్లించిన డబ్బు ఏమి చేశారని, క్రీడల గురించి అవగాహన లేని బాలకిషన్‌ను తక్షణమే తొలగించాని ఆయన డిమాండ్ చేశారు. వీసీకి వినతి పత్రం అందజేసిన వారిలో పీడీఎస్‌యూ నాయకులు ప్రిన్స్, దేవిక, బిందు, హుస్సెన్, ప్రదీప్, తదితరులు పాల్గొన్నారు.

ఉపాధి హామీకి కసరత్తు

(ఐదో పేజీ తరువాయి)

పనులను వర్తింపజేయనున్నారు. చెరువులలో పూడికతీయడం, మట్టి తీయడం పనులు గత కొన్నేళ్లుగా చేపడుతున్నందున ఈ దఫా గ్రామాల పరిధిలో వ్యవసాయానికి ఉపయోగపడే పనులను ఎక్కువగా చేపట్టేందుకు నిర్ణయించారు. గ్రామ పంచాయతీల పరిధిలో పశువులకు సంబంధించిన షెడ్‌ల నిర్మాణానికి ఈ దఫా అధిక ప్రాధాన్యం ఇవ్వాలని నిర్ణయం తీసుకున్నారు. ప్రతీ షెడ్డుకు రూ.82వేలుగా అంచనా వేశారు. ప్రతీ మండలానికి ఒకటి పౌల్ట్రీ పెట్టుకునేందుకు నిధులను విడుదల చేయనున్నారు. ఒక్కొక్క పౌల్ట్రీకి రూ.3లక్షలు ఉపాధి హామీ కింద ఇవ్వనున్నారు. కోళ్ల పెంపకాన్ని ప్రోత్సహించేందుకు అధికారులు ఈ నిర్ణయం తీసుకున్నారు. గ్రామాల్లో పంట చేనులకు వెళ్లే దారుల నిర్మాణం కోసం ఉపాధి హామీ నిధులను వెచ్చించనున్నారు. ఫార్మేషన్ ఆఫ్ రోడ్స్‌లో ఉపాధి కూలీలకు పనులను కల్పించనున్నారు. ఉపాధి హామీ కింద చెరువులు, ప్రాజెక్టులకు సంబంధించిన పిల్ల కాలువల పనులను కూడా చేయనున్నారు. వ్యవసాయానికి ఉపయోగపడే ఫామ్‌పాండ్స్ నిర్మాణానికి, చెక్ డ్యామ్‌ల నిర్మాణం కోసం ఉపాధి హామీ నిధులను వెచ్చించనున్నారు. వీటితో పాటు పండ్ల తోటల పెంపకం, కూరగాయల సాగు కూడా ఉపాధి హామీ నిధులను వెచ్చించే విధంగా బడ్జెట్‌లో పేర్కొన్నారు. కేంద్ర ప్రభుత్వం విడుదల చేసిన మార్గదర్శకాలకు అనుగుణంగా ఈ ఉపాధి హామీ పనులను చేపట్టేందుకు నిర్ణయం తీసుకున్నామని జిల్లా గ్రామీణాభివృద్ధి అధికారి సాయాగౌడ్ తెలిపారు. కొత్త ఆర్థిక సంవత్సరంలో వ్యవసాయానికి సంబంధించిన పనులను ఎక్కువగా ఉపాధి హామీ కింద చేపడుతామని తెలిపారు. పశువుల పెంపకం, కోళ్ల పెంపకం, ఉద్యానవన పంటలకు ప్రాధాన్యం ఇచ్చే పనులనే చేపడుతున్నామని ఆయన తెలిపారు.

రూ. వెయ్యి కోసం ఇద్దరి హత్య

(ఐదో పేజీ తరువాయి)

ఏసీపీ కథనం ప్రకారం.. నగరానికి చెందిన ఎండీ.ఆమర్‌ఖాన్, రియాజ్‌ఖాన్, మహ్మద్ బహదూర్ (40), సయ్యద్ యూసుఫ్ (40) నలుగురు స్నేహితులు. వీరంతా కూలీ పనులు చేయడంతో పాటు శ్మశానాల్లో కాలిన బూడిదలో నుంచి బంగారం సేకరించేవారు. ఇందులో భాగంగానే ఈనెల 18వ తేదీన అమర్‌ఖాన్, రియాజ్‌ఖాన్, బహదూర్‌లు కలిసి బైక్‌పై నగర శివారులోని నిజాంసాగర్ కెనాల్‌కు ఆనుకొని ఉన్న శ్మశానవాటికకు వెళ్లారు. అక్కడి శ్మశానంలోని బూడిద నుంచి బంగారం తీసేందుకు ప్రయత్నించగా.. వారికీ ఏమీ దొరకలేదు. దీంతో మార్గమధ్యలో బహదూర్ వద్ద ఉన్న రూ.వెయ్యితో ముగ్గురూ కలిసి మద్యం తాగారు. ఆ తర్వాత నగరంలోని గూపన్‌పల్లిలో గల శ్మశాన వాటిక వద్దకు ముగ్గురూ కలిసి వెళ్లారు. కానీ అక్కడ కూడా వారికి ఎలాంటి బంగారం దొరకలేదు. దీంతో మద్యం తాగేందుకు తాను ఖర్చు చేసిన వెయ్యి రూపాయలు ఇవ్వాలంటూ అమర్‌ఖాన్, రియాజ్‌ఖాన్‌తో బహదూర్ గొడవకు దిగాడు. దీంతో కోపోద్రిక్తులైన వారు బహదూర్ తలపై కర్రలతో కొట్టి హత్య చేశారు. బహదూర్ మృతదేహాన్ని ఎవరికీ అనుమానం రాకుండా సమీపంలో ఉన్న పులాంగ్ చెరువులో పడేశారు. ఆ తర్వాత ఈ నెల 19వ తేదీన మరో స్నేహితుడైన యూసుఫ్.. బహదూర్ ఎందుకు కనిపించడం లేదంటూ ఇద్దరినీ అడిగాడు. దీంతో యూసుఫ్ ద్వారా విషయం బయటకు వస్తుందని భయపడ్డ భావించిన అమర్‌ఖాన్, రియాజ్‌ఖాన్‌లు.. ఎలాగైనా అతన్ని కూడా హత్య చేయాలని నిర్ణయించుకున్నారు. ఇందులో భాగంగానే స్నానానికి వెళదామని యూసుఫ్‌ను నగరంలోని బాబన్ సహాబ్‌పహాడ్ వద్ద గల చెరువు వద్దకు తీసుకెళ్లారు. అదే నీటిలో యూసుఫ్‌ను ముంచి దారుణంగా హత్య చేసి.. ఎవరికీ అనుమానం రాకుండా అక్కడి నుంచి వెళ్లిపోయారు. అయితే స్థానికుల సమాచారంతో యూసుఫ్ మృతదేహం చెరువులో లభించడంతో.. నగర ఆరో టౌన్ పోలీసులు కేసు దర్యాప్తు చేపట్టారు. దీంతో పలు ఆసక్తికరమైన విషయాలు వెలుగులోకి వచ్చాయి. నిజామాబాద్ సౌత్ రూరల్ సీఐ ఆధ్వర్యంలో పోలీసులు ఆధునిక సాంకేతిక పరిజ్ఞానంతో పాటు సెల్‌ఫోన్ సిగ్నళ్ల ఆధారంగా లోతుగా విచారణ జరిపారు. అదే సమయంలో అమర్‌ఖాన్, రియాజ్‌ఖాన్‌లపై అనుమానంతో వీరిద్దరినీ అదుపులోకి తీసుకొని విచారణ చేపట్టగా.. అసలు విషయం వెలుగు చూసింది. విచారణలో నేరం అంగీకరించడంతో.. అమర్‌ఖాన్, రియాజ్‌ఖాన్‌పై హత్య కేసు నమోదు చేసి రిమాండ్‌కు తరలించినట్టు ఏసీపీ ఎల్.రాజవెంకట్‌రెడ్డి తెలిపారు. ఈ జంట హత్యలను ఛేదించిన సౌత్ రూరల్ పోలీసులకు ఏసీపీ అభినందించారు. ఈ విలేకరుల సమావేశంలో రూరల్ సీఐ సురేష్, ఎస్సై మహ్మద్ ఆసిఫ్, సిబ్బంది పాల్గొన్నారు.



విద్యార్థులకు యూనిఫాంలు పంపిణీ చేస్తున్న దృశ్యం

విద్యార్థులకు యూనిఫాంల పంపిణీ

మోపాల్, జనవరి 24 (ఆంధ్రజ్యోతి): నిజామాబాద్ రూరల్ మండలంలోని గుండారం ప్రభుత్వ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో చదువుకుంటున్న విద్యార్థులకు తెల్ల యూనిఫాంలను పంపిణీ చేశారు. గణతంత్ర దినోత్సవం సందర్భంగా విద్యార్థులు తెలుపురంగు యూనిఫాంలు ధరించాలని నిర్ణయించారు. విద్యార్థులు కొనుగోలు చేయలేని పరిస్థితి ఉన్న 20మంది విద్యార్థులకు బొడ్డు ధరణి, కుందారపు అంజన్ ప్రసాద్ దంపతులు యూనిఫాంలను విద్యార్థులకు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా పాఠశాల ప్రధానోపాధ్యాయులు అమర్‌నాథ్ మాట్లాడుతూ.. పేద విద్యార్థులకు యూనిఫాంలు అందజేయడం సంతోషకరమన్నారు. విద్యార్థులు క్రమశిక్షణతో బాగా చదువుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయులు, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

డిగ్రీ కళాశాలలో ఓటరు దినోత్సవం

ధర్పల్లి, జనవరి 24 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలోగల డిగ్రీ కళాశాలలో శుక్రవారం ఓటరు దినోత్సవాన్ని నిర్వహించారు. పొలిటికల్ సైన్స్ డిపార్ట్‌మెంట్ ఆధ్వర్యంలో జాతీయ ఓటరు దినోత్సవం సందర్భంగా కళాశాలలో విద్యార్థిని విద్యార్థులకు ప్రిన్సిపాల్ ఎం.జ్యోతి అవగాహన కల్పించారు. 18 సంవత్సరాలు నిండిన యువతీ యువకులు ఓటరుగా నమోదు చేసుకోవాలని సూచించారు. ఓటరు యొక్క ఆవశ్యకతను వివరించారు. ఓటు హక్కును వినియోగించుకునే విధంగా విద్యార్థులు గ్రామాల్లో గ్రామస్థులను జాగృతం చేయాలని ఆమె వివరించారు. ఈ కార్యక్రమంలో అధ్యాపక బృందం, విద్యార్థులు పాల్గొన్నారు.

చికెన్ ధరలు

రకం	లైవ్	విత్‌స్కిన్	స్కిన్‌లెస్
సుగుణ (కిలో)	రూ.160	రూ.255	రూ. 275
వెన్‌కాబ్(కిలో)	రూ.165	రూ.260	రూ. 280

బంగారం ధరలు

బిస్కెట్ (10 గ్రా.)	ఆర్నమెంట్(10 గ్రా.)	వెండి(10 గ్రా.)
రూ.82400	రూ.76000	రూ.960

సినిమా గైడ్ నిజామాబాద్

పీవీఆర్ మల్టీప్లెక్స్.. వేణుమాల్

స్క్రీన్-1 : సంక్రాంతికి వస్తున్నాం (10.00, 1.00, 4.00, 7.00, 10.00)
స్క్రీన్-2 : స్కై ఫోర్స్ (హిందీ) (10.50, 1.35, 7.25, 10.10)
: డాకు మహారాజ్ (4.20)
స్క్రీన్-3 : తల్లి మనస్సు (11.05)
: గాంధీతాత చెట్టు (2.10, 8.00)
: గేమ్ చేంజర్ (4.40) : హత్య (10.30)
స్క్రీన్-4 : డియర్ కృష్ణ (11.00)
: ఐడెంటిటి (1.45)
: హాంకాంగ్ వారియర్స్ (5.00)
: డాకు మహారాజ్ (7.20)
: పుష్ప-2 (10.25)

ఉషాప్రసాద్ మల్టీప్లెక్స్..

స్క్రీన్-1 : సంక్రాంతికి వస్తున్నాం (11.00, 1.30, 4.30, 7.20, 10.00)
స్క్రీన్-2 : ఐడెంటిటి (10.40)
: డాకు మహారాజ్ (4.30, 10.20)
: గేమ్ చేంజర్ (7.20)
స్క్రీన్-3 : స్కై ఫోర్స్ (హిందీ) (11.00, 1.50, 4.50, 7.30, 10.30)



దేవి : డాకు మహారాజ్ (11.15, 2.15, 6.15, 9.15)
నటరాజ్ : స్కైఫోర్స్ (హిందీ) (11.15, 2.15, 6.15, 9.15)
విజయ్: సంక్రాంతికి వస్తున్నాం (11.15, 2.15, 6.15, 9.15)
లలితామహల్: గేమ్ చేంజర్ (11.30, 2.30, 6.30, 9.30)

- నిజామాబాద్ అర్బన్